ఓం

శ్రీ భగవద్గీత

అథ నవమో౽ధ్యాయః

తొమ్మిదవ అధ్యాయము

రాజవిద్యా రాజగుహ్యయోగః

రాజవిద్యా రాజగుహ్యయోగము

ఈ అధ్యాయము యొక్క పేరు :-

'రాజవిద్యా రాజగుహ్యయోగము' - రాజ పదము శ్రేష్ఠత్వమును సూచించును. రాజవిద్యయనగా విద్యలలోకెల్ల శ్రేష్ఠమైనదనియు, రాజగుహ్యమనగా రహస్యములలోకెల్ల పరమరహస్యమైనదనియు అర్థము. లేక, రాజవిద్యయనగా పూర్వకాలము రాజులు అనుష్ఠించుచువచ్చిన గొప్పవిద్యయనియు చెప్పవచ్చును. ఈ అధ్యాయమునందు చెప్పబడిన అమూల్యమగు అధ్యాత్మబోధ విద్యలన్నిటిలోను సర్వోత్కృష్టమైనదియు, రహస్యములన్నిటిలోను పరమరహస్యమైనదియు అయియుండుటవలన ఈ అధ్యాయమునకు రాజవిద్యా రాజగుహ్యయోగమను పేరువచ్చినది.

ఈ అధ్యాయమందలి ప్రధాన విషయములు :-

(1) అధ్యాత్మవిద్యా ప్రభావము (1 శ్లో॥ నుండి 3 శ్లో॥ వఱకు)

(2) భగవత్స్వరూపవర్ణనము - (4 శ్లో॥ నుండి 6 శ్లో॥ వఱకు)

(3) జగదుత్పత్తి - (7శ్లో॥ నుండి 10శ్లో॥ వఱకు)


(4) ఆసురీప్రకృతికలవారియొక్కయు, దైవీప్రకృతికలవారియొక్కయు లక్షణములు - (11 శ్లో॥ నుండి 15 శ్లో॥ వఱకు)

(5) భగవానుని సర్వాత్మ స్వరూపము - (16 శ్లో॥ నుండి 19 శ్లో॥ వఱకు)

(6) స్వర్గాదికామనారూపమైన సకామోపాసనయొక్క ఫలము, నిష్కామోపాసన యొక్క ఫలము - (20 శ్లో॥నుండి 25 శ్లో॥ వఱకు)

(7) భగవద్భక్తితో గూడిన నిష్కామకర్మాచరణముయొక్క అఖండమహిమ (26 శ్లో॥ నుండి - 34 శ్లో॥ వఱకు)

రాజవిద్యారాజగుహ్యయోగము



పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి
తదహం భక్త్యుపహృతమశ్నామి ప్రయతాత్మనః. (9–26)

ఎవడు నాకు భక్తితో ఆకునుగాని, పువ్వునుగాని, పండునుగాని, జలమునుగాని సమర్పించుచున్నాడో అట్టి పరిశుద్ధాంతఃకరణునియొక్క (లేక, పరమార్థయత్నశీలునియొక్క) భక్తిపూర్వముగ నొసంగబడిన ఆ పత్రపుష్పాదులను నేను (ప్రీతితో) ఆరగించుచున్నాను (అనుభవించుచున్నాను).

పూర్వాధ్యాయముతో ఈ అధ్యాయమునకు గల సంబంధము :-

ఏడవ అధ్యాయమగు విజ్ఞానయోగమున భగవానుడు సగుణ, నిర్గుణ పరబ్రహ్మస్వరూపములను వర్ణించిచెప్పుచు తుట్టతుదకు అధిభూత, అధిదైవాదిసహితముగ బ్రహ్మమును సాక్షాత్కరించుకొను విషయమునుగూర్చియు, అంత్యకాలమున చిత్తమును పరమాత్మయందు నెలకొల్పు విషయమును గూర్చియు సూచనామాత్రముగ తెలుప, వెంటనే అర్జునుడు వాని వివరములు తెలిసికొనదలంచి ఏడుప్రశ్నలను గావించెను. ఆ ప్రశ్నలను పురస్కరించుకొని సమాధానముల నొసంగుచు భగవానుడు ఎనిమిదవ అధ్యాయమునంతను దానికొఱకై వినియోగించిరి. ఇకనిపుడు పూర్వము 7వ అధ్యాయమున తాను చెప్పుచువచ్చిన విజ్ఞానవిషయమునే మఱల కొనసాగించుచు శ్రీకృష్ణపరమాత్మ ఈ తొమ్మిదవ అధ్యాయమును ప్రారంభించుచున్నారు. పూర్వము తాను తెలిపియుండిన జ్ఞాన, విజ్ఞాన విషయములనే మఱల ఈ అధ్యాయప్రారంభమున ప్రస్తావించుచు వానిగూర్చివిపులముగ నిపుడు బోధించిరి. అదియే రాజవిద్యా రాజగుహ్యాయోగమనంబడు ఈ తొమ్మిదవ అధ్యాయము. అతిరహస్యమై, మోక్షప్రదమైనట్టి అధ్యాత్మజ్ఞానమును విజ్ఞానసహితముగ తానిపుడు చెప్పబోవుచున్నానని భగవానుడు తెలుపుచున్నాడు -

శ్రీ భగవానువాచ :-

1. ఇదం తు తే గుహ్యతమం ప్రవక్ష్యామ్యనసూయవే
జ్ఞానం విజ్ఞానసహితం యజ్జ్ఞాత్వా మోక్ష్యసేఽశుభాత్.

శ్రీ భగవానువాచ = భగవంతుడగు శ్రీ కృష్ణుడు పలికెను -

టీక:- యత్ = దేనిని, జ్ఞాత్వా = తెలిసికొని, అశుభాత్ = అశుభరూపమగు సంసారబంధమునుండి, మోక్ష్యసే = విముక్తుడవుకాగలవో, (తత్ = అట్టి), గుహ్యతమమ్ = అతిరహస్యమైనదియు, విజ్ఞానసహితమ్ = అనుభవజ్ఞానముతో గూడుకొనినదియునగు, ఇదంజ్ఞానమ్ తు = ఈ బ్రహ్మజ్ఞానమునైతే, అనసూయవే = అసూయలేనివాడవగు, తే = నీకు, ప్రవక్ష్యామి = లెస్సగాచెప్పుచున్నాను.

తా:- శ్రీ భగవంతుడు చెప్పెను - (ఓ అర్జునా!) దేనిని తెలిసికొనినచో అశుభరూపమగు ఈ సంసారబంధమునుండి నీవు విడివడుదువో అట్టి అతిరహస్యమైన, అనుభవజ్ఞానసహితమైన ఈ బ్రహ్మజ్ఞానమును అసూయలేనివాడవగు నీకు లెస్సగా జెప్పుచున్నాను (వినుము).

వ్యాఖ్య:- ఇకనిపుడు విద్యలలోకెల్ల శ్రేష్ఠమైనదియు, అతిరహస్యమైనదియునగు బ్రహ్మవిద్యను అనుభవపూర్వకముగ భగవానుడు బోధించుచున్నారు. 'గుహ్యతమమ్' అని చెప్పుటవలన ఈ బోధ రహస్యముయొక్క పరాకాష్ఠను సూచించుచున్నది. బ్రహ్మోపదేశము సామాన్యముగ అధికారియగు మనుజునకే కావింపబడుచుండును. దానిని వినుటకుకూడ యోగ్యత అవసరము. ఆ యోగ్యత యేది ? అసూయాది దుర్గుణములు లేకుండుటయే. చిత్తశుద్ధి గలిగియుండుటయే. సాధనచతుష్టయ సంపత్తిచే ఈ యోగ్యత చేకూరును. అయితే ఇచట బ్రహ్మజ్ఞానము బోధింపబడుచున్న అర్జునున కట్టి యోగ్యతకలదా? అని యడుగవచ్చును. కలదనియే చెప్పవలసియున్నది. ఏలయనిన, ఈ అధ్యాయప్రారంభముననే శ్రీకృష్ణమూర్తి అర్జునుని అసూయారహితునిగ ('అనసూయవే') వర్ణించిరి. అసూయాది దుర్గుణములు లేనివాడని బాగుగ నెఱింగి యున్నందుననే శ్రీకృష్ణపరమాత్మ అర్జునునకు గీతోపదేశమును గావించిరి. కావున సమీపించుటతోడనే

బ్రహ్మజ్ఞానమును బోధించుడని గురువులను వేధించు శిష్యులు ముమ్మందు తమకట్టి అసూయాది దుర్గుణములు తొలగినవాయని ప్రశ్నించుకొనవలెను. వస్త్రము నిర్మలముగా నున్నపుడే రంగు అంటునట్లు, శుద్ధచిత్తునియందే బ్రహ్మజ్ఞానము ప్రవేశించును. మలినచిత్తునియందుగాదు.

ఈ ప్రకారముగ 'అనసూయవే' అనుపదముద్వారా భగవానుడు బ్రహ్మవిద్యకు యోగ్యతను నిరూపించినవారైరి. కాబట్టి సాధకులివ్విషయమున కడుజాగురూకులై బ్రహ్మజ్ఞానమును బడయుటకుముందు అట్టి అసూయారాహిత్యము తమకు గలిగినదాయని ప్రశ్నించుకొని, లేకున్న అద్దానిని బాగుగ సిద్ధింపజేసికొనవలెను. దంభదర్పాది దుర్గుణములన్నిటికిని 'అసూయ' రాజు అయియున్నది. కనుకనే అది యిచట పేర్కొనబడినది. అది ఒక వేరుపురుగువంటిది. వేరుపురుగు చెట్టునంతను క్రమముగ గుల్లచేసివైచునట్లు అసూయ జీవునియందు ప్రవేశించినచో, ఆత డంతవఱకు చేసిన సాధననంతను ఒకతృటిలో నది భ్రష్టముచేసివేయగలదు. కనుకనే పరమార్థరంగమున ఎంతయో సాధనచేసినవారుకూడ ఒక్కొక్కప్పుడీ అసూయారాక్షసికి బలియై తమ సాధనసర్వస్వమును గోల్పోయి పతనమొందుచున్నారు. కాబట్టి భగవానుడు లోకులను ఈ 'అనసూయవే' అను పదముద్వారా జాగరూకులుగానుండుడని, హెచ్చరికచేసిరి. అసూయను పోగొట్టుకొని అర్జునునివలె బ్రహ్మవిద్యకు అధికారులు కండని బోధించిరి. అట్టి అర్హతను బొందినవారికి సద్గురువులు అతిరహస్యములైన, అంశములన్నిటిని బహిర్గతముచేసి వైతురు. ఇక్కారణముననే 'వక్ష్యామి' అని పలుకక, 'ప్రవక్ష్యామి' అని భగవానుడు పలికిరి. అనగా 'లెస్సగా జెప్పుచున్నాను వినుము' అని భావము. అర్జునునిపై ఈ ప్రీతి గురువగు శ్రీకృష్ణున కేలకలిగెను? అర్జునునియందు అసూయలేదు. అందువలన; మఱియు సామాన్యముగ జనులు రహస్యములను అందఱికిని చెప్పరు. మిక్కిలి నమ్మకముగలిగియున్నవారికే చెప్పుదురు. ఇపుడు భగవానుడు చెప్పబోవునది 'గుహ్యతమమగు' విద్య. అనగా అతిరహస్యమైనవిద్య. దానిని చెప్పవలెననిన, బోధితు డెంతయో విశ్వాసపాత్రుడై యుండవలెను. ఆ విశ్వాసమో, శిష్యుని హృదయనైర్మల్యమునుజూచి గురువునకు కలుగుచుండును.

మఱియు 'విజ్ఞాన సహితముగ నీకు జ్ఞానమును బోధించుచున్నాను' అని శ్రీ కృష్ణమూర్తి వచించుటలో ఒక విశేషముకలదు. శాస్త్రములో జ్ఞానమని, విజ్ఞానమని రెండుకలవు. జ్ఞానమనగా శాస్త్రజన్యజ్ఞానము, పరోక్షజ్ఞానము. విజ్ఞానమనగా అనుభవజ్ఞానము, అపరోక్షజ్ఞానము. బోధ అనుష్ఠానరూపముగ పరిణమించినపుడే పూర్ణఫలితమును గలుగజేయును. కనుకనే గీతయందు జ్ఞానబోధతో తృప్తినొందక శ్రీకృష్ణమూర్తి విజ్ఞానమునుగూడ లెస్సగ బోధించినవారైరి.

ఇక నట్టి విజ్ఞానసహిత జ్ఞానమును తెలిసికొనినందువలన గలుగు ప్రయోజనమేమి? ఆ ప్రయోజనమేదియో భగవానుడే సెలవిచ్చిరి. దాని ప్రయోజనము జననమరణరూప అశుభమునుండి విడివడుటయే యగును. పుట్టుక, చావు, దుఃఖము, రోగము, ముసలితనము మొదలగు అశుభములతో గూడుకొనిన ఈ భయంకర సంసారమునుండి అది జనులను విముక్తులుగజేయును. కావున దుఃఖమును బోగొట్టుకొన దలంచువాడు ఈ బ్రహ్మవిజ్ఞానమును తప్పక సంపాదించవలెను. ఈ విషయమును భగవాను డిచట స్పష్టపఱచిరి. మఱియు ఈసంసారమునుజూచి జనులు ఏమో గొప్పగ తలంచుకొనుచున్నారు. కాని శ్రీకృష్ణమూర్తి దానినంతను 'అశుభముగ' వర్ణించిరి. ఏలయనిన అదియంతయు అసత్యమై, దృశ్యరూపమై, ఆత్మేతరమై, క్షణికమై, నశ్వరమైయున్నది. అశుభము నాశ్రయించినవా డశుభమునే పొందును. శుభము నాశ్రయించినవాడు శుభమునేపొందును. ఈ ప్రపంచమున ఆత్మయొకటియే, దైవమొకటియే శుభము. కావున దానినే ఆశ్రయించవలెను. అత్తఱి యశుభమునుండి యాతడు విముక్తిని బడయుగలడు. ఈ ప్రకారముగ

జ్ఞానవిజ్ఞానముల నాశ్రయించువారికి కలుగు ప్రత్యక్షఫలితము సంసార దుఃఖరాహిత్యము, నిరతిశయ ఆత్మానందప్రాప్తి అయియున్నది. కాబట్టి విజ్ఞులెల్లరు భగవానుడు బోధింపబోవు ఈ అనుభవపూర్వక బ్రహ్మతత్త్వమునెఱింగి కృతార్థులు కావలయును.

ప్ర:— బ్రహ్మవిద్య యెట్టిది?

ఉ:— విద్యలలోకెల్ల శ్రేష్ఠమైనది, అతిరహస్యమైనది.

ప్ర:— అది యెవరికి బోధింపబడును?

ఉ:— అసూయాది దుర్గుణములులేనివారికి.

ప్ర:— బ్రహ్మవిద్యకు అర్హతయేమి?

ఉ:— హృదయశుద్ధి, అసూయాది దుర్గుణరాహిత్యము.

ప్ర:— మనుజుడు కడతేరవలెననిన దేనిని తెలిసికొనవలెను?

ఉ:— జ్ఞానమును, విజ్ఞానమును (అనుభవజ్ఞానము).

ప్ర:— దానిని తెలిసికొనినందువలన గలుగు ప్రయోజనమేమి?

ఉ:— జీవుడు జననమరణాది అశుభములనుండి విముక్తుడుకాగలడు.

ప్ర:— ఈ సంసార మెట్టిది?

ఉ:— అశుభరూపమైనది.

ప్ర:— దానినుండి తప్పించుకొనుట ఎట్లు?

ఉ:— అనుభవపూర్వకముగ బ్రహ్మజ్ఞానము నొందుటయే.

అ॥ అట్టి బ్రహ్మజ్ఞానమును సంస్తుతించుచున్నాడు –

2. రాజవిద్యా రాజగుహ్యం పవిత్రమిదముత్తమమ్
ప్రత్యక్షావగమం ధర్మ్యం సుసుఖం కర్తుమవ్యయమ్.

టీక:— ఇదమ్ = ఈ బ్రహ్మజ్ఞానమును, రాజవిద్యా = విద్యలలోకెల్ల శ్రేష్ఠమైనదియు, రాజగుహ్యమ్ = రహస్యములలోకెల్ల అతిరహస్యమైనదియు, ఉత్తమమ్ = సర్వోత్కృష్టమైనదియు, పవిత్రమ్ = పవిత్రమైనదియు, ప్రత్యక్షావగమమ్ = ప్రత్యక్షముగ తెలియందగినదియు, ధర్మ్యమ్ = ధర్మయుక్తమైనదియు, కర్తుమ్ = అనుష్ఠించుటకు, సుసుఖమ్ = మిక్కిలి సులభమైనదియు, అవ్యయమ్ = నాశములేనిదియు అయియున్నది.

తా:– ఈ బ్రహ్మజ్ఞానము విద్యలలోకెల్ల శ్రేష్ఠమైనదియు, రహస్యములలోకెల్ల అతి రహస్యమైనదియు, సర్వోత్కృష్టమైనదియు, పవిత్రమైనదియు, ప్రత్యక్షముగ తెలియదగినదియు, ధర్మయుక్తమైనదియు, అనుష్ఠించుటకు మిగుల సులభమైనదియు, నాశరహితమైనదియు అయియున్నది.

వ్యాఖ్య:– ఈ అధ్యాయమున చెప్పబోవు బ్రహ్మజ్ఞానము ఎట్టిదో, దాని మహిమ ఏమియో ఈశ్లోకమున వివరింపబడుచున్నది. ప్రపంచములో అనేక విద్యలు కలవు. కాని అవియేవియు జీవుని జననమరణములనుండి తప్పించజాలవు. ఒక్క బ్రహ్మవిద్యయే అట్టిపనిని చేయజాలియున్నది. మఱియు దృశ్యవస్తువులన్నియు నశ్వరములు. కావున వానినిగూర్చిన విద్యయేదియు మనుజునకు పూర్ణశాంతిని గలుగజేయజాలదు. శాశ్వతమగు బ్రహ్మము (ఆత్మ) ను గూర్చిన విద్యయే శాంతిని చేకూర్చగలదు. కనుకనే బ్రహ్మవిద్య విద్యలలోకెల్ల శ్రేష్ఠమని, రాజవిద్యయని యిచట పేర్కొనబడినది. మఱియు లోకములో పవిత్రతమమైనట్టి పరమాత్మవస్తువును ప్రతిపాదించునది యగుటబట్టి ఇదియు అతిపవిత్రమైనదియే యగును.

'ప్రత్యక్షావగమమ్' – ఈ బ్రహ్మవిద్యను ప్రత్యక్షముగ తెలిసికొనవచ్చును. అనుభూత మొనర్చుకొనవచ్చును. ఇది ప్రత్యక్షఫలమునే కలుగుజేయునుగాని పరోక్షఫలమునుగాదు. ఏలయనిన, ఏక్షణమున సాధకు డీ బ్రహ్మవిద్యను అనుభూతమొనర్చుకొనుచున్నాడో, ఆ క్షణముననే ఆతడు సాక్షాత్ బ్రహ్మమే యగుచుండుట కానబడుచున్నది. కావున ఇది ఫలితమును గలుగజేయునో, లేదో, యను సందేహమున కాస్కారములేదు.

'సుసుఖమ్' – ఈ బ్రహ్మవిద్యను ఆచరించుట చాలతేలికయని చెప్పబడినది. మనస్సునందలి దుస్సంస్కారములను, వాసనాజాలమును ప్రయత్నపూర్వకముగ తొలగించుకొనినచో, ఇక స్వస్వరూపసాక్షాత్కారమునం దేలాటి పరిశ్రమయులేదు. కనుకనే శాస్త్రములం దీ ఆత్మానుభూతి పుష్పములను నలుపుటకంటెను, శ్వాసను పీల్చుటకంటెనుగూడ సులభమని వచింపబడినది. బ్రహ్మానుభవము అతిసులభమైనదని ఈ ప్రకారముగ భగవానుడు గీతయందు సాధకులకు ధైర్యమును గొలుపుచున్నారు. మఱియు ఈ విద్య ధర్మములకు మూలమున్ను, సనాతనమున్ను, అవ్యయమున్ను అయియున్నదనియు ఇచట చెప్పబడినది.

ఈ ప్రకారముగ శ్రీకృష్ణపరమాత్మ తానుబోధింపదలచిన బ్రహ్మజ్ఞానము యొక్క మహిమను ప్రారంభముననందే వెల్లడించిరి. దీనిచే ముముక్షువులకు దానియందెంతయో ప్రీతి, విశ్వాసము జనించుచున్నది.

ప్ర:– బ్రహ్మజ్ఞాన మెట్టిది?

ఉ:– (1) విద్యలన్నిటిలో శ్రేష్ఠమైనది (2) అతిరహస్యమైనది (3) పవిత్రమైనది (4) ఉత్తమమైనది (5) ప్రత్యక్షముగ తెలిసికొనదగినది (6) ధర్మయుక్తమైనది (7) సులభముగ ఆచరింపదగినది (8) నాశరహితమైనది.

అ॥ దానియందు శ్రద్ధలేనివారు దైవమును బొందజాలరనియు, సంసారకూపముననే తిరుగాడుచుందురనియు వచించుచున్నాడు –

3. అశ్రద్దధానాః పురుషా ధర్మస్యాస్య పరన్తప
అప్రాప్య మాం నివర్తన్తే మృత్యుసంసారవర్త్మని.

టీక:– పరన్తప = శత్రువులను తపింపజేయు ఓ అర్జునా!, అస్య = ఈ, ధర్మస్య = (ఆత్మజ్ఞానమను) ధర్మమునందు, అశ్రద్దధానాః = శ్రద్ధలేనట్టి, పురుషాః = మనుష్యులు, మామ్ = నన్ను, అప్రాప్య = పొందక, మృత్యుసంసారవర్త్మని = మృత్యురూపమైన సంసారమార్గమునందు, నివర్తన్తే = మఱలుచున్నారు, (తిరిగితిరిగి పుట్టుచున్నారు లేక సంసారముననే స్థిరముగ నుండుచున్నారు).

తా:– ఓ అర్జునా! ఈ (ఆత్మజ్ఞానమను) ధర్మమునందు శ్రద్ధలేనట్టి మనుజులు నన్ను పొందనివారై మృత్యురూపమైన సంసారమార్గమునందే మఱలుచున్నారు (తిరుగుచున్నారు, లేక నిక్కముగ వర్తించుచున్నారు).

వ్యాఖ్య:– లౌకికరంగమునగాని, పరమార్థరంగమునగాని ప్రతికార్యమునందును శ్రద్ధ చాల అవసరము. ఒకనికి ఒక వస్తువునందుగాని, ఒక కార్యమునందుగాని ఎంతెంత శ్రద్ధయుండునో అంతంతచక్కగ ఆ వస్తువు ఫలించుచుండును. ఆ కార్యము నెరవేరుచుండును. కనుకనే భగవాను డీ శ్లోకమున తానుచెప్పబోవు బ్రహ్మజ్ఞానమం దెవనికి శ్రద్ధయుండునో, ఆతడు శ్రద్ధాపూర్వకముగ దాని ననుష్ఠించి తన్ను జేరగలడనియు, అట్లు శ్రద్ధలేనివారు తన్ను పొందజాలనివారై మృత్యురూపమగు సంసారముననే పడి తిరుగాడుచుందురనియు సెలవిచ్చిరి. కాబట్టి విజ్ఞులగువారు చక్కగా యోచించుకొని, దుఃఖప్రదమగు సంసారమార్గమున బడకుండుటకును, ఆనందప్రదమగు దైవసాక్షాత్కారమును బడయుటకును, శ్రద్ధయను ఈ సుగుణమును జేపట్టి బ్రహ్మవిద్యను చక్కగ అనుష్ఠించి తరించవలయును. లోకమున సామాన్యకార్యములగు వంట, సేద్యము మున్నగునవి చక్కగ జరుగుటకే ఎంతయో శ్రద్ధ అవసరమైయుండ ఇక బ్రహ్మవిద్యాసాధనమున వేఱుగజెప్పవలెనా? కనుకనే గీతాచార్యులు తనబోధయం దపుడపుడు ఈ శ్రద్ధయనుదానిని నొక్కి చెప్పుచుపోయిరి.

ఇక ఈ సంసారమార్గమెట్టిదో ఈ శ్లోకమున విశదీకరింపబడినది. సామాన్యముగ కొందఱుజనులు భోగవిలాసములకులోనై ఈ సంసారమును స్వర్గతుల్యముగ భావించుదురు. అమృతప్రాయముగ దానిని వర్ణించుదురు. కాని సర్వజ్ఞుడగు పరమాత్మ దానిని మృత్యురూపముగ వర్ణించిరి (మృత్యుసంసారవర్త్మని). అదియే దాని నిజరూపము. మాయాప్రభావముచే ఈసంసారము పైకి 'డాబు'గా కనుపించినను లోన మృత్యురూపమే కలిగియున్నది. ఈ రహస్యమును భగవాను డీ శ్లోకమున బహిర్గతమొనర్చిరి. బాగుగ అలంకరింపబడిన శవ మేప్రకారము పైకి అందముగ గనుపించినను లోన క్రుళ్లు, దుర్గంధము గలిగియుండునో, ఈ సంసారస్థితియు అంతియే. కాబట్టి విజ్ఞులు దానిచే మోసపోక అమృతరూపుడగు పరమాత్మనాశ్రయించి ధన్యులు కావలయును. నివర్తన్తే అను పదమునకు 'నితరాం వర్తన్తే' - మిక్కిలి (స్థిరముగ) వర్తించుచున్నారు - అనియు చెప్పవచ్చును.

ప్ర:– పరమాత్మను ఎవరు పొందగలరు?

ఉ:– బ్రహ్మజ్ఞానమందు శ్రద్ధగలవారు.

ప్ర:– అట్లు శ్రద్ధలేనివారిగతి యేమగును?

ఉ:— వారు పరమాత్మను బొందలేక మృత్యురూపమగు సంసారముననే తిరుగాడుచుందురు.

ప్ర:— ఈ సంసారముయొక్క స్వరూపమెట్టిది?

ఉ:— అది మృత్యురూపమై యున్నది. అనగా జననమరణరూపమై, దుఃఖభూయిష్ఠమైయున్నదని భావము.

అ॥ పరమాత్మయొక్క స్వరూపమును ఏడుశ్లోకములద్వారా వర్ణించుచున్నాడు -

4. మయా తతమిదం సర్వం జగదవ్యక్తమూర్తినా
మత్స్థాని సర్వభూతాని న చాహం తేష్వవస్థితః.

టీక:— ఇదమ్ = ఈ, సర్వమ్ = సమస్తమైన, జగత్ = ప్రపంచము, అవ్యక్త మూర్తినా = ఇంద్రియగోచరముకాని స్వరూపముగల, మయా = నాచేత, తతమ్ = వ్యాపింపబడినది, సర్వభూతాని = సమస్తప్రాణికోట్లు, మత్స్థాని = నాయందున్నవి, తేషు = వానియందు, అహమ్ = నేను, న చ అవస్థితః = ఉండుటలేదు (నాకవి ఆధారములు కావు).

తా:— ఈ సమస్తప్రపంచము అవ్యక్తరూపుడనగు నాచే వ్యాపించబడియున్నది. సమస్తప్రాణికోట్లు నాయందున్నవి. నేను వానియందుండుటలేదు. (నాకవి ఆధారములు కావు).

వ్యాఖ్య:— 'అవ్యక్తమూర్తినా' - ఇంద్రియములకు గోచరముకాని అతిసూక్ష్మవస్తువే పరమాత్మ. సామాన్యమగు భూతాకాశమే నేత్రములకు కానరాకయుండ, ఇక సూక్ష్మాతిసూక్ష్మమైన చిదాకాశము (ఆత్మ) నేత్రాదుల కెట్లుగోచరించును? కనుకనే పరమాత్మ అవ్యక్తరూపుడని ఇట పేర్కొనబడెను. స్థూలాకాశముచే ఏ ప్రకారము జగత్తంతయు పరివ్యాప్తమైయున్నదో, అట్లే చిదాకాశము(పరమాత్మ)చే ఈ స్థూల, సూక్ష్మజగత్తంతయును, ప్రాణికోట్లన్నియును వ్యాప్తములైయున్నవి. కావున అవియన్నియు పరమాత్మయందే యున్నవగును.

'న చాహం తేష్వవస్థితః' - అవియన్నియు 'నాయందున్నను నేను వానియందులేను' అని భగవాను డేల పలికిరి; వాస్తవదృష్టితో పరికించిన ఈ నామరూపాత్మకమగు దృశ్యజగత్తంతయు స్వప్నమువలె మిథ్యయైయున్నది. ఆత్మయొకటియే సత్యము. ఆ ఆత్మయందీ దృశ్యజాతమంతయు రజ్జువునందు సర్పమువలె ఆరోపింపబడియున్నది. కనుక మిథ్యాభూతమగు దృశ్యవస్తువునందు సత్యవస్తువగు పరమాత్మ యెట్లుండ గలడు? కాబట్టియే భగవాను డిచట 'నాయందీ భూతములన్నియు కలవు, నేను వానియందు లేను' అని చెప్పుటకు కారణము.

స్థూల సూక్ష్మమగు చరాచరప్రపంచ మంతటను పరమాత్మ వ్యాపించియుండుటచేత, ఆతడు లేనిచోటు లేదు. కనుక సాధకుడు ఆతని ఉనికిని సర్వత్ర అనుభూత మొనర్చుకొనుచు పాపకృత్యములు చేయక, ప్రాణికోట్ల యెడల దయగలిగి, భక్తిభావసమన్వితుడై యుండవలెను.

ప్ర:— పరమాత్మ యెట్టి రూపముగలవాడు?

ఉ:— ఇంద్రియములకు గోచరముకాని అతిసూక్ష్మరూపము కలవాడు.

ప్ర:— ఆత డెచట నున్నాడు?

ఉ:— స్థూల సూక్ష్మ సమస్త ప్రపంతమునందును వ్యాపించియున్నాడు.

ప్ర:— ప్రాణికోట్లన్నియు ఎచట నున్నవి?

ఉ:— ఉపమాత్మయందు స్థితిగల్గియున్నవి.

5. న చ మత్స్థాని భూతాని పశ్య మే యోగమైశ్వరమ్
భూతభృన్న చ భూతస్థో మమాత్మా భూతభావనః.

టీక:— భూతాని = ప్రాణులు, మత్స్థాని న చ = నాయం దుండునవియుకావు, మే = నాయొక్క, ఐశ్వరమ్ = ఈశ్వరసంబంధమైన, యోగమ్ = యోగమహిమను, పశ్య = చూడుము, మమ = నాయొక్క, ఆత్మా = ఆత్మ (స్వరూపము), భూతభృత్ = ప్రాణికోట్లను భరించునదియు, భూతభావనః అపి = ప్రాణికోట్లను ఉత్పన్న మొనర్చునదియు (లేక రక్షించునదియు) అయినను, భూతస్థః = ప్రాణికోట్లయందుండునది (వాని నాధారముచేసికొని యుండునది), న చ = కాదు.

తా:— ప్రాణికోట్లు నాయం దుండునవియుకావు. ఈశ్వరసంబంధమగు నా యీ యోగమహిమను జూడుము. నాయాత్మ (స్వరూపము) ప్రాణికోట్ల నుత్పన్న మొనర్చునదియు, భరించునదియునైనను ఆ ప్రాణులయం దుండుటలేదు. (వాని నాధారముగ జేసికొని యుండునదికాదు.)

వ్యాఖ్య:— క్రిందటి శ్లోకములో 'నాయందు సమస్తప్రాణులు కలవు' అని చెప్పి ఈ శ్లోకమున 'నాయం దే ప్రాణులు లేవు' అని చెప్పుట విపరీతము కాదాయని ప్రశ్నించవచ్చును. సామాన్యుల దృష్టియందు దృశ్యమనునది యొకటి యున్నది గనుక అది భగవంతునియందు స్థితిగల్గియున్నదని, దాని కాధార మా భగవంతుడేయనియు వచింపబడినది. పరమార్థదృష్టియందు ద్వైతమనునదియే యుండదు. కావున ఇక ప్రపంచముగాని, ప్రాణికోట్లుగాని అత్తఱియుండవు. ఒకే చిద్ఘనపరమాత్మ శేషించియుండును. కావున అట్టి అద్వైతదృష్టియందు 'నాయం దీభూతములు కలవు' అను వాక్యమెట్లు పొసగును? కావున 'నా యందు ఏ భూతములున్ను లేవు. దృశ్యము నాయందు లేనే లేదు. నేను దృశ్యమందు లేను.' అని సర్వోన్నత అద్వైతదృష్టితో భగవానుడీవాక్యములను బలికిరి. ఎట్లనిన, మేలుకొనిన తరువాత మనుజుడు 'స్వప్నలోకము నాయందు లేదు, నేను స్వప్నలోకమునందు లేను' అని ఎట్లుచెప్పునో, సర్పభ్రమ తొలగిన మీదట రజ్జువునందు సర్పముగాని, సర్పమునందు రజ్జువుగాని లేదని ఎట్లుచెప్పునో, అట్లే పై వాక్యములనున్ను భగవానుడు దృశ్యరహిత పరిపూర్ణాద్వైతదృష్టియందు చెప్పిరి. అట్టి పూర్ణస్థితియందు ఒక్క బ్రహ్మము (ఆత్మ) తప్ప అన్యమగు ఏ వస్తువున్ను ఉండనేరదు. కావున ద్వైతదృష్టిలో తనయొక్క స్వరూపము ప్రాణులను భరించుచున్నను, రక్షించుచున్నను, పరమార్థదృష్టిలో ప్రాణులతోగాని, జగత్తుతోగాని ఏమాత్రము సంబంధములేక పరమాత్మ వెలయుచున్నారు. ఆ సత్యమునే గీతాచార్యు లీశ్లోకమున వెల్లడించి, జగత్తుతోటి తనయొక్క అసంగత్వమును, నిర్లేపత్వమును వ్యక్తపఱచినవారై ఆ తన యోగమహిమను గాంచవలసినదిగా అర్జునున కాదేశించిరి. ఇదియే ఈశ్వర సంబంధమగు గొప్ప యోగమహిమ.

పరమార్థదృష్టియందు జగత్తు బ్రహ్మరూపముగనే శేషించియుండును. జగత్తను పదార్థ మొకటి వేఱుగనుండదు. ఆరోపితవస్తువు సత్యదృష్టియందు అధిష్ఠానరూపముగనే పరిణమించునుగదా! అట్టి పరిపూర్ణదృష్టినే శ్రీకృష్ణపరమాత్మ ఈ శ్లోకమున వ్యక్తపఱచినవారైరి.

ప్ర:– ఈశ్వరీయ యోగమహిమ యెట్టిదో నిరూపింపుము?

ఉ:– పరమాత్మ ప్రాణులను భరించుచున్నను, రక్షించుచున్నను, అవియేవియు వాస్తవముగ అతనియమదు లేకయు నున్నాడు. ఇదియే ఈశ్వరమహిమ.

ప్ర:– పూర్ణాద్వైతదృష్టియందు జగత్తుయొక్క స్థానమెచట?

ఉ:– అట్టిస్థితియందు జగత్తు అనునదియే యుండదు. అంతయు ఒకే బ్రహ్మస్వరూపముగ నుండును.

అ॥ ఇక ద్వైతదృష్టియందు జగత్తుయొక్క స్థానమును వివరించుచున్నాడు –

6. యథాऽऽకాశస్థితో నిత్యం వాయుస్సర్వత్రగో మహాన్
తథా సర్వాణి భూతాని మత్స్థానీత్యుపధారయ.

టీక:– యథా = ఏ ప్రకారముగ, సర్వత్రగః = అంతటను సంచరించునదియు, మహాన్ = గొప్పదియునగు, వాయుః = వాయువు, నిత్యమ్ = ఎల్లప్పుడును, ఆకాశస్థితః = ఆకాశమునందున్నదో (ఉండియు ఆకాశముచే నంటబడకనున్నదో), తథా = ఆ ప్రకారముగనే, సర్వాణి = సమస్తములైన, భూతాని = ప్రాణులున్ను, మత్స్థాని ఇతి = నాయందున్నవని, ఉపధారయ = తెలిసికొనుము.

తా:– ఏ ప్రకారముగ అంతటను సంచరించునదియు, గొప్పదియునగు వాయువెల్లప్పుడును ఆకాశమునందున్నదో, ఆ ప్రకారమే సమస్త ప్రాణికోట్లును నాయందున్నవని తెలిసికొనుము.

వ్యాఖ్య:– సమస్తప్రాణికోట్లు పరమాత్మయం దేప్రకారము స్థితిగల్గియుండుచున్నవో అనువిషయం ఇచట ఒక ఉపమానముద్వారా చెప్పబడినది. వాయువు చాల విశాలమైనది, అంతట సంచరించునది, గొప్పది. అయినను అది సదా ఆకాశమందు ఒకమూల అణగియే యుండుచున్నది. అట్లే జగత్తు విశాలమైనది, అనేక ప్రాణికోట్లతో గూడినది. అయినను పరమాత్మయందది ఏమూలనో అణగియుండుచున్నది. మఱియు ఆకాశము తనయందున్న వాయువుతో అతిసన్నిహితముగనున్నను దానితో ఏమాత్రము నంటక నిర్లేపముగ నెట్లున్నదో, అట్లే పరమాత్మ జగత్తును తనయందు (కల్పితముగ) కలిగియున్నను, దానితో నేమియు అంటకనున్నాడు. వాయువుయొక్క గుణదోషములు, ఆకాశమునంటని విధమున ప్రాణులయొక్క గుణదోషములుగాని, కర్మాదులుగాని పరమాత్మనంటవు. ఆకాశము కంటికి కానరాదు. అట్లే పరమాత్మ అవ్యక్తరూపుడు. ఆకాశము సూక్ష్మమైనది. సర్వవ్యాపకమైనది. అట్లే పరమాత్మ అతిసూక్ష్మరూపుడు, సర్వవ్యాపకుడు. ఈ ప్రకారముగ ఆకాశమునకు, పరమాత్మకు కొన్ని సామ్యములున్నందున, పరమాత్మను వర్ణించునపుడు స్థూలదృష్టిగలవారికి గ్రాహ్యమగుటకొఱకై ఆకాశదృష్టాంతమును వాడుచుందురు. కాని వాస్తవముగ పరమాత్మ ఆకాశముకాదు. ఏలయనిన, ఆకాశము జడమైనది. పరమాత్మ చైతన్యస్వరూపుడు.

ఆకాశమువలె పరమాత్మ సర్వత్రవ్యాపించియున్నారని చెప్పబడుటవలన, వారి అస్తిత్వమును సర్వత్ర అనుభూతమొనర్చుకొనవలెను. దేవుడు ఎక్కడున్నాడు? అను ప్రశ్నకు ఈ శ్లోకమునుబట్టి అంతట నున్నాడని చెప్పవలసివచ్చును. అణువణువునందును వారు వ్యాపించియున్నారు. ఈ సత్యమును తెలిసికొనినచో ఇక జనులు పాపకృత్యముల నెట్లు చేయగలరు? చేయలేరు. ఏలయనగా, సర్వత్ర పరమాత్మ వారి చేష్టలను గమనించుచునేయున్నారని తెలియగలదు. కావున అట్టివారు పాపభీతి గల్గి, సుగుణసంపత్తియుతులై మెలగుదురు. మఱియు సమస్తజీవరాసులను పరమాత్మ తనయందు గలిగియున్నటుల చెప్పబడినందున, జీవులకంటె ఈశ్వరు డెంతటి ఉన్నత స్థానమందు స్థితిగల్గియున్నాడో విశదమగుచున్నది. కాబట్టి జనులు తమ అల్పబల, సౌందర్య, ధన, అధికారాదులనుజూచి గర్వించక, తాను గొప్ప అను దర్పమును విడనాడి, సర్వేశ్వరునియెడల భక్తిప్రపత్తులుగలవారై వారిని సేవించవలెనని స్పష్టమగుచున్నది.

ప్ర:– సమస్త ప్రాణికోట్లు ఎచ్చోట స్థితిగలిగియున్నవి?

ఉ:– పరమాత్మయందు.

ప్ర:– ఏ ప్రకారముగ ?

ఉ:– ఆకాశమునందు వాయువువలె.

అ॥ జగత్తుయొక్క సృష్టిస్థితి లయములకు తానే కారకుడని భగవానుడు సెలవిచ్చుచున్నాడు -

7. సర్వభూతాని కౌన్తేయ ప్రకృతిం యాన్తి మామికామ్
కల్పక్షయే పునస్తాని కల్పాదౌ విసృజామ్యహమ్.

టీక:– కౌన్తేయ = ఓ అర్జునా!, సర్వభూతాని = సమస్తప్రాణికోట్లు, కల్పక్షయే = ప్రళయకాలమున, మామికామ్ = నాదియైన (స్వాధీనమైన), ప్రకృతిమ్ = ప్రకృతిని (మాయను), యాన్తి = పొందుచున్నవి, కల్పాదౌ = సృష్టికాలమున, తాని = వానిని, పునః = మరల, అహమ్ = నేను, విసృజామి = సృష్టించుచున్నాను.

తా:– అర్జునా! సమస్తప్రాణికోట్లు ప్రళయకాలమున నా ప్రకృతిని (మాయను) జేరి అందు అణగియుండును. తిరిగి సృష్టికాలమున వానిని నేను సృజించుచుందును.

వ్యాఖ్య:– జీవులు ప్రకృతికి (మాయకు) లోబడియున్నారు. ప్రకృతి పరమాత్మకు లోబడియున్నది. కనుకనే 'మామికామ్' - నా సంబంధమైన ప్రకృతి, లేక నా స్వాధీనమందున్న ప్రకృతి అని శ్రీకృష్ణమూర్తిచే చెప్పబడెను.

మాయాం తు ప్రకృతిం విద్ధి మాయినం తు మహేశ్వరమ్. అను శ్రుతివాక్య మీ యర్థమునే బోధించుచున్నది. ప్రకృతియే మాయ. ఆ ప్రకృతిని మాయను స్వాధీనపఱచుకొనినవాడే మహేశ్వరుడు. దీనినిబట్టి ప్రకృతిని జయించుటకు మాయను స్వాధీనపఱచుకొనుటకు సర్వేశ్వరునియొక్క సహాయము, అనుగ్రహము ఎంతేని ఆవశ్యకమైయున్నదని స్పష్టమగుచున్నది. కావున పరమార్థరంగమున సాధకుడు

పురోభివృద్ధినొందవలెననిన, మాయను జయించవలెననిన, సర్వేశ్వరునియొక్కయు, ఆ మాయను ఇదివఱకే జయించియున్నట్టి జీవన్ముక్తులగు మహాత్ములయొక్కయు అనుగ్రహమును సంపాదించుకొనవలయును. అపుడే అతడు సులభముగ గట్టెక్కగలడు. ప్రకృతికి లోబడినవారందఱు ఈ శ్లోకమున జెప్పబడినట్లు సృష్టికాలమున పుట్టుచు, ప్రళయకాలమున లయించుచు రాకడపోకడలు గలిగి యుందురు. ఆ సంసృతినుండి తప్పించుకొనవలెననిన, మాయాధీశుడగు పరమాత్మను జీవుడాశ్రయించియే తీరవలెను.

ప్ర:- ప్రకృతి (మాయ) ఎవరి స్వాధీనములో నున్నది?

ఉ:- పరమాత్మయొక్క స్వాధీనములో నున్నది.

ప్ర:- ప్రకృతికి లోబడియున్నవారి గతి ఎట్లుండును?

ఉ:- సృష్టికాలమున పుట్టుచు, ప్రళయకాలమున లయించుచు నుందురు.

8. ప్రకృతిం స్వామవష్టభ్య విసృజామి పునః పునః
భూతగ్రామమిమం కృత్స్నమవశం ప్రకృతేర్వశాత్.

టీక:- ప్రకృతేః = ప్రకృతికి (మాయకు లేక స్వకీయకర్మకు), వశాత్ = అధీనమైయుండుటవలన (వశమగుటవలన), అవశమ్ = అస్వతంత్రమైన, ఇమమ్ = ఈ, కృత్స్నమ్ =సమస్తమైన, భూతగ్రామమ్ = ప్రాణిసముదాయమును, (అహమ్ = నేను), స్వామ్ = స్వకీయమైన, ప్రకృతిమ్ = ప్రకృతిని (మాయను); అవష్టభ్య = అవలంబించి, (స్వీకరించి), పునః పునః = మఱల మఱల, విసృజామి = సృష్టించుచున్నాను.

తా:- ప్రకృతికి (మాయకు లేక స్వకీయకర్మకు) అధీనమై యుండుటవలన అస్వతంత్రమైనట్టి ఈ సమస్త ప్రాణిసముదాయమును నేను స్వకీయప్రకృతిని అవలంబించి మఱలమఱల సృష్టించుచున్నాను.

వ్యాఖ్య:- ఈ శ్లోకమునందు జీవేశ్వరులయొక్క భేదము చక్కగ వివరింపబడినది. జీవుడు ప్రకృతికి వశుడు. ఈశ్వరుడు ప్రకృతిని స్వాధీనపఱచుకొనినవాడు. జీవులు వారివారి కర్మలకు లోబడి, వారివారి మనఃప్రకృతికి వశులై అస్వతంత్రులై యున్నారు. 'కృత్స్నం' అని చెప్పుటవలన ఒకరిద్దఱు కాదనియు, సమస్తప్రాణికోటియు (ప్రకృతిని జయించిన జీవన్ముక్తులు మినహా) ఆ ప్రకారము ప్రకృతికి అధీనమైయే యున్నదని స్పష్టపఱుపబడినది. ఎంతవఱకు కర్మయుండునో, వాసనలుండునో, అంతవఱకు జన్మ తప్పదు. కనుకనే అజ్ఞానులగు ఆ జీవులను మఱలమఱల సృష్టించుచున్నానని భగవానుడు పలికిరి.

కాబట్టి ఈ జననమరణరూప సంసారబంధమును తొలగించుకొన దలంచువారు పరమాత్మను ఆశ్రయించి వారివారి ప్రకృతిని, మనస్సును, జయించుకొనవలెను. బంధవిముక్తి కిదియే యుపాయము. అజ్ఞానులగు జనులు తమకెంతటి భౌతికసంపత్తియున్నను ప్రకృతికి లోబడినవారే కనుకను, తమ ఇంద్రియములకు దాసులే కనుకను, అస్వతంత్రులే యగుదురు. వారు బలాత్కారముగ జన్మకర్మలను బొందుచునేయుందురు. కాబట్టి అధ్యాత్మజ్ఞానమును సముపార్జించి, పరమాత్మయొక్క అనుగ్రహమును సంపాదించి, ప్రకృతిని జయించుటద్వారా జనులు సంసారబంధవిముక్తిని పొందవలసియున్నారు.

రంగులరాట్నముపై ఎక్కిన మనుజులు అవశులై తిరుగులాగున, మాయాచక్రమధిష్ఠించిన జీవులు వారివారి ప్రకృతికి వశులై అస్వతంత్రులై సంసారమున తిరుగాడుచున్నారు. రంగులరాట్నమును ఆపవలెననిన, దానిని త్రిప్పువానిని ఎట్లాశ్రయించవలెనో, అట్లే మాయాచక్రమును త్రిప్పు పరమాత్మను ముక్తికొఱకై జీవు లాశ్రయించవలెను.

ప్ర:— జీవులు దేనికి వశులై యున్నారు?

ఉ:— వారివారి ప్రకృతికి (కర్మకు).

ప్ర:— కావున ఆత్మస్వాతంత్ర్యమునకై జీవు లేమి చేయవలెను?

ఉ:— మాయాధీశుడగు పరమాత్మయెడల అనన్యభక్తిగలిగి తమ ప్రకృతిని (మనస్సును, ఇంద్రియములను, కర్మను) జయించుకొనవలెను.

అ॥ ఈ ప్రకారము జనులను మఱల మఱల సృష్టించుచున్నను వారి కర్మలతో తన కేలాటిసంబంధములేదని భగవానుడు పలుకుచున్నాడు -

9. న చ మాం తాని కర్మాణి నిబధ్నన్తి ధనంజయ
ఉదాసీనవదాసీన మసక్తం తేషు కర్మసు.

టీక:— ధనంజయ = ఓ అర్జునా!, తేషు కర్మసు = ఆ కర్మములందు, అసక్తమ్ = తగులుకొననివాడనై (ఆసక్తిలేనివాడనై), ఉదాసీనవత్ = తటస్థునివలె, ఆసీనమ్ = ఉండునట్టి, మామ్ = నన్ను, తాని కర్మాణి = ఆ కర్మములు, న నిబధ్నన్తి = బంధింపవు.

తా:— ఓ అర్జునా! (ఆ ప్రకారము జీవులను సృష్టించినవాడనైనను) ఆ సృష్ట్యాదికర్మలయందు తగులుకొననివాడనై సాక్షీభూతుడుగ నుండునట్టి నన్ను ఆకర్మలెవ్వియు బంధింపనేరవు.

వ్యాఖ్య:— ఈ ప్రకారముగ జీవులను మఱల మఱల సృష్టించుచున్నను ఆ కర్మలతో పరమాత్మ కేలాటి సంబంధమున్ను లేదు. వారు తటస్థులు, సాక్షీభూతులు. సూర్యుని సన్నిధానమాత్రముచేతనే జనులు వారివారి కర్మల నాచరించినను, ఆ కర్మలతో సూర్యునకేలాటి సంబంధమున్ను ఎట్లులేదో, అట్లే భగవత్సాన్నిధ్యముచే జరుగు ప్రకృతి చర్యలకు సృష్ట్యాదికర్మలచే వాస్తవముగ ఆ భగవంతున కేసంబంధమున్ను లేదనియు, వానియందు వారు తగుల్కొనరనియు, వానిచే బంధితులుకారనియు ఇట వచింపబడినది. దీనినిబట్టి పరమాత్మతో నైక్యమొందిన జీవులకున్ను కర్మబంధమేమియు నుండజాలదని స్పష్టమగుచున్నది.

అ॥ భగవత్సాన్నిధ్యముచే ప్రకృతి చరాచరసృష్టినంతయు గావించుచున్నదని వచించుచున్నాడు -

10. మయాఽధ్యక్షేణ ప్రకృతిః సూయతే సచరాచరమ్
హేతునానేన కౌన్తేయ జగద్విపరివర్తతే.

టీక:– కౌన్తేయ = ఓ అర్జునా!, అధ్యక్షేణ = అధ్యక్షుడనైయున్న (సాక్షీభూతుడనైయున్న), మయా = నాచేత, ప్రకృతిః = ప్రకృతి, (మాయ) సచరాచరమ్ = చరాచరప్రపంచమునంతను, సూయతే = పుట్టించుచున్నది, అనేనహేతునా = ఈ కారణముచేత, జగత్ = జగత్తు, విపరివర్తతే = ప్రవర్తించుచున్నది.

తా:– ఓ అర్జునా! అధ్యక్షుడనై (సాక్షిమాత్రుడనై) యున్న నాచేత ప్రకృతి చరాచర ప్రపంచమునంతను సృజించుచున్నది. ఈ కారణముచేతనే జగత్తు ప్రవర్తించుచున్నది.

వ్యాఖ్య:– ప్రకృతి జడమైనది. పరమాత్మ చైతన్యరూపుడు. పరమాత్మసాన్నిధ్యము చేతనే ప్రకృతి చరాచరప్రాణికోట్లను సృజింపగల్గుచున్నది. సూదంటురాయియొక్క సన్నిధానమందు ఇనుపసూది కదలుచున్నను, సూదంటురాతికి ఏకర్తృత్వమున్ను లేదు. అది సాక్షిమాత్రమైయున్నది. అట్లే పరమాత్మయు జగద్వ్యవహారమున సాక్షిమాత్రుడై యొప్పుచున్నాడు. అతని సన్నిధానమహిమచే ప్రకృతి సమస్తజగత్కార్యములను జేయుచున్నది. పరమాత్మయొక్క ఇట్టి తాటస్థ్యమును, చైతన్యశక్తిని వర్ణించుటకై ఈ శ్లోకమందు 'అధ్యక్షేణ' అను చక్కటి పదమొకటి ప్రయోగింపబడినది. ఒక సభలో ఎందఱు సభ్యులు గుమిగూడినను సభకు చైతన్యమురాదు. అధ్యక్షుడు వచ్చికూర్చొనుటతోనే సభకు చైతన్యము వచ్చును. అట్లే ఒకకోర్టులో తక్కిన వారెందఱున్నప్పటికిని 'జడ్జీ' వచ్చి కూర్చొననిదే కార్యక్రమము జరుగదు. అతడు వచ్చినతోడనే అతని సాన్నిధ్యముచేతనే కోర్టువ్యవహారమంతయు నడచిపోవును. అట్లే ప్రకృతియు ఈశ్వరసాన్నిధ్యములేనిచో జడమై, సృజనశక్తిరహితమై యుండును. చిద్ఘనుడగు పరమాత్మవలననే ప్రకృతికి సృష్టిరూపశక్తి ఏర్పడుచున్నది. ఈ హేతువుచేతనే జగత్తంతయు పరివర్తనము గలిగియుండుచున్నది. లేకున్న ఇంజనులేని రైలుపెట్టెలవలె ప్రపంచము నిర్వీర్యమై, నిశ్చేష్టమై యుండగలదు.

సామాన్యముగ జనులయొక్కదృష్టి స్థూలప్రపంచమువఱకే పోవుచున్నది. గావున దానినే సత్యమనినమ్మి దానివెంటనే పరుగెత్తుచున్నారు. కాని ఈ శ్లోకముద్వారా వారు పొరబడుచున్నారని తెలియగలదు. స్థూలప్రపంచము జడమైనది. దానిని త్రిప్పునట్టిదియు, దానికి చైతన్యశక్తిని ప్రసాదించునదియునగు అతిసూక్ష్మమైన (ఆత్మ) వస్తువు దాని వెనుకగలదు. స్థూలదృష్టికి అదిగోచరింపదు. విజ్ఞాననేత్రముచే దానినెఱుంగవలెను. అదియే పరమాత్మ. ప్రపంచమంతయు ఆ పరమాత్మయందు ఆరోపింపబడినది. ఆరోపితవస్తువునకు స్వతః ఏ బలమున్ను, వ్యక్తిత్వమున్ను ఉండదు. అది తనశక్తిని అధిష్ఠానవస్తువునుండియే పరిగ్రహించును. అట్లే ఆరోపితమగు జగత్తుయొక్క శక్తి యంతయు అధిష్ఠానమగు పరమాత్మవలననే కలుగుచున్నది. (అయినను పరమాత్మకర్తృత్వరహితులై, సాక్షిమాత్రులై, ఆ యా జడక్రియలయందు నిర్లిప్తులై యున్నారు). దీనినిబట్టి భౌతికశక్తిగాని, మానసికశక్తిగాని ఎంతగొప్పదైనను ఆధ్యాత్మికశక్తియొద్ద తీసికట్టేయగును. ఆత్మశక్తి ప్రధానమైనది. చైతన్యవంతమైనది. తక్కిన శక్తులన్నియు ప్రకృతికి జెందినవై అప్రధానములైయున్నవి. కావున విజ్ఞుడు స్వల్పస్వల్ప భౌతికశక్తుల సముపార్జనయందే జీవితమును ధారబోయక వానినిజూచి మురిసిపోవక దైవశక్తిని సముపార్జించవలెను. మఱియు చిన్న చిన్న అధ్యక్షపదవులకై అఱ్ఱులు చాచక, జగదధ్యక్షులగు పరమాత్మయొక్క సాన్నిధ్యమునకై, ఐక్యమునకై యత్నించవలెను. ఎద్దానివలన ఈ చరాచరజగత్తంతయు వ్యవహారసమర్థమై యొప్పుచున్నదో అట్టి అధిష్ఠానచైతన్య పరమాత్మయొక్క సాక్షాత్కారముకొఱకే యత్నించవలెనుగాని, జడములగు దృశ్యవస్తువుల స్వీకరణముచే సంతృప్తిని బొందరాదు.

ప్ర:– ఈ జగత్తునకు అధ్యక్షుడెవడు?

ఉ:– పరమాత్మ. అతని సాన్నిధ్యమువలననే ఈ చరాచరజగత్తంతయు వ్యవహరించుచున్నది.

అ॥ భగవానుని అట్టి మహిమను గుర్తెఱుంగని అసురీప్రకృతియుతులగు మూఢులయొక్క ప్రవర్తనను రెండు శ్లోకములద్వారా గర్హించుచున్నాడు -

11. అవజానన్తి మాం మూఢా మానుషీం తనుమాశ్రితమ్
పరం భావమజానన్తో మమ భూతమహేశ్వరమ్

టీక:– మమ = నాయొక్క, పరంభావమ్ = పరమతత్త్వమును (సర్వోత్తమస్వరూపమును), అజానన్తః = ఎఱుంగని, మూఢాః = అవివేకులు, భూతమహేశ్వరమ్ = సమస్తప్రాణులకు నియామకుడను, మానుషీంతనుమ్ = (లోకసంరక్షణార్థము) మనుష్యదేహమును, ఆశ్రితమ్ = ఆశ్రయించినవాడనునగు, మామ్ = నన్ను, అవజానన్తి = అవమానించుచున్నారు. (అలక్ష్యము చేయుచున్నారు).

తా:– నాయొక్క పరమతత్త్వమును ఎఱుంగని అవివేకులు సర్వభూతమహేశ్వరుడను, (లోకసంరక్షణార్థము) మనుష్యదేహమును ఆశ్రయించినవాడనునగు నన్ను అవమానించుచున్నారు. (అలక్ష్యము చేయుచున్నారు.)

వ్యాఖ్య:– పరమాత్మ సమస్తభూతకోట్లకు నియామకుడు, ప్రభువు, ఈశ్వరుడు. ధర్మోద్ధరణముకొఱకు, లోకసంరక్షణముకొఱకు అపుడపుడు లోకమున అవతరించుచుండును. అట్లు మనుష్యదేహమును గ్రహించి లోకమున అవతరించిన సాక్షాత్ భగవానుని మూఢులు తెలిసికొనజాలక, ఎవరో సామాన్యుడని తలంచి ఆతనిని అవమానించుచున్నారు. నిర్లక్ష్యము చేయుచున్నారు. అతని పరతత్త్వమును వారు గ్రహించుటలేదు. అట్టివారిని 'మూఢులు' అని శ్రీకృష్ణమూర్తి సంబోధించిరి. ఏలయనగా, ఒకింతైనను వివేకముకలవారు అట్లు పరమాత్మను ద్వేషింపరు. కొందఱు జనులు అహంభావపూరితులై, తమ ధనజనసంపదాదులను, అధికారమును జూచుకొని గర్వులై కన్నుమిన్ను తెలియక మహాత్ములను, సాధుపుంగవులను దూషించుచుందురు. హేళనచేయుచుందురు. శిశుపాల, దుర్యోధనాదు లీ తెగలోనివారు. కనుకనే వారు దుష్ఫలితముల ననుభవించిరి.

ఆధ్యాత్మికసాధనలు చేయువారికి తమజీవితములో నిందాస్తుతులకు గురియగు సందర్భములు కొన్ని తటస్థింపవచ్చును. అట్టి సందర్భములలో ఎంతయో సహనము గల్గి తమయం దేవేని దోషములున్నచో తొలగించుకొని, ఏ దోషములు లేనపుడు గంభీరచిత్తులై ఆ యా నిందలకు జంకక నుండవలెను. లోకులలో కొందఱి స్వభావము ఈ ప్రకారముగనే పరనిందాత్మకముగ నుండునని తలంచి మనఃస్థిమితము గల్గియుండవలెను. సాక్షాత్ శ్రీకృష్ణపరమాత్మయే అవివేకుల నిర్హేతుకనిందలకు గురి అయినపుడు ఇక సామాన్యులవిషయము వేఱుగ చెప్పవలెనా? అని ఇట్లు తలంచి ధైర్యము తెచ్చుకొని సహనశీలురై యుండవలెను మాయయొక్క స్వభావ మిట్లేయుండునని గ్రహించి నిశ్చలచిత్తులై యుండవలెను. ఎవరిని ద్వేషింపరాదు. ఎవరైన అవివేకులు భగవంతునిగూర్చి నిందాపూర్వకముగ పలికినచో ఆ వాక్యములను ముముక్షువులు లక్ష్యపెట్టక అట్టి నాస్తికుల వచనములను విశ్వసింపక భగవద్భక్తిని అభివృద్ధిపఱచుకొనుచు, తద్ద్వారా వారికి చక్కని బుద్ధి గఱపవలెను.

ప్ర:— పరమాత్మ యెట్టివాడు?

ఉ:— (1) సమస్తప్రాణికోట్లకు నియామకుడు (2) లోకోపకారార్థము అత డపుడపుడు మనుష్యాది దేహములను గ్రహించుచుండును.

ప్ర:— ఈశ్వరుని పరతత్త్వము నెఱుంగని అవివేకులెట్లు ప్రవర్తించుదురు?

ఉ:— లోకసంరక్షణార్థము మానవదేహమును ధరించిన పరమాత్మను ఆతడెవడో సామాన్యుడని తలంచి అవమానించుదురు.

ప్ర:— దీనినిబట్టి గ్రహించవలసిన యంశములేవి?

ఉ:— (1) మూఢత్వమును పోగొట్టుకొనవలెను (2) పరులను నిందించరాదు (3) భగవానుని నిజతత్త్వ మెఱింగి ఆతనియెడల భక్తిభావము గలిగియుండవలెను.

12. మోఘాశా మోఘకర్మాణో మోఘజ్ఞానా విచేతసః
రాక్షసీమాసురీం చైవ ప్రకృతిం మోహినీం శ్రితాః.

టీక:— (తే = వారు), మోఘాశాః = వ్యర్థములైన ఆశలుగలవారును, విచేతసః = బుద్ధిహీనులును (అగుచు), మోహినీమ్ = మోహమును గలుగజేయునదియు, రాక్షసీమ్ = రాక్షస సంబంధమైనదియు, ఆసురీంచ = అసురసంబంధమైనదియునగు, ప్రకృతిమ్ఏవ = స్వభావమునే, శ్రితాః = ఆశ్రయించినవారు (అగుచున్నారు).

తా:— (అట్టివారు) వ్యర్థములైన ఆశలుగలవారును, వ్యర్థములైన కర్మలుగలవారును, వ్యర్థమైన జ్ఞానముగలవారును, బుద్ధిహీనులును (అగుచు) రాక్షససంబంధమైనదియు, అసురసంబంధమైనదియునగు స్వభావమునే ఆశ్రయించుచున్నారు.

వ్యాఖ్య:— జనుల ప్రకృతి (స్వభావము) సామాన్యముగ రెండువిధములుగ నుండుచుండును. (1) దైవీప్రకృతి (2) ఆసురీప్రకృతి - అని. అందు ఆసురీప్రకృతిగలవారిని గూర్చి క్రిందటి శ్లోకమునందును, ఈ శ్లోకమునందును తెలియజేసిరి. దైవీప్రకృతి గలవారిని గూర్చి రాబోవు శ్లోకమున చెప్పుదురు. ఆసురీప్రకృతిగలవారు వ్యర్థములైన ఆశలు, కర్మలు గలిగియుందురు. వారికుండు ఒకింత జ్ఞానమున్ను నశ్వరములగు దృశ్యవస్తువులనుగూర్చినదియే యగుటబట్టి అదియు పరమార్థదృష్టియందు నిష్ఫల మైనదియే యగును. వారి చిత్తమందు సత్యవస్తువు (ఆత్మ)ను గూర్చిన పరిజ్ఞానముగాని, వివేకముగాని ఒకింతైనను ఉండదు. కనుకనే వారు 'విచేతసులు'గ (Brainless people), చిత్తముచెడినవారుగ, బుద్ధిహీనులుగ వర్ణింపబడిరి. మఱియు నట్టివారు రాక్షససంబంధమైనదియు, మోహపెట్టునదియు, అనగా అజ్ఞానమున బడద్రోయునదియునగు స్వభావమునే ఆశ్రయించుదురు. ఇచట 'రాక్షసీం', 'ఆసురీం' అను రెండుపదములను ఒకేచోట ప్రయోగించుటవలన వారి క్రూరస్వభావము, రాజస, తామస స్వభావము లెస్సగ వ్యక్తమొనర్పబడినట్లైనది. అట్టివారు పరమార్థదృష్టియందు ఎందుకు పనికిరానివారే యగుదురు. కనుకనే వారిబ్రతుకు మోఘపుబ్రతుకని (వ్యర్థజీవితమని) భగవాను డిచట స్పష్టముగ చెప్పివైచిరి. అందులకే 'మోఘ'

మనుపద మీశ్లోకమున వరుసగ మూడు పర్యాయములు ప్రయోగింపబడినది. మిథ్యారూపములైన దృశ్యవస్తువులనే పట్టిప్రేలాడుచు సత్యమగు పరమాత్మను విస్మరించువారి జీవితము నిజముగ వ్యర్థమేయగును.

కావున జనులు రాక్షసప్రకృతిని, అసురస్వభావమును, కామాదిదుర్గుణములను, రాజస తామస ప్రవృత్తులను పారద్రోలి దైవీసంపత్తిని ఆశ్రయించి సత్యవస్తువగు పరమాత్మను నమ్మి తమతమ జీవితములను సార్థకము చేసికొనవలయును. ఈ శ్లోకమందు అజ్ఞానులు వ్యర్థమగు ఆశ, వ్యర్థమగు కర్మ, వ్యర్థమగు జ్ఞానము గలిగియుందురని చెప్పబడెను, గావున విజ్ఞులగువారు తద్విరుద్ధమగు ఆచరణనే స్వీకరించుచు అనగా దైవమును గూర్చిన ఆశ, దైవమును గూర్చిన కర్మ, దైవమునుగూర్చిన జ్ఞానమునే కలిగియుండి విగతచిత్తులుకాక 'విశేషచిత్తులై' దైవచిత్తులై మెలగవలయును.

ప్ర:— అసురప్రకృతి యెట్టిది?

ఉ:— జనులను మోహపెట్టునది, అజ్ఞానమున బడద్రోయునది.

ప్ర:— అసురప్రకృతి కల వారెట్టి గుణములు కలిగియుందురు?

ఉ:— (1) వ్యర్థములగు ఆశలు, (2) వ్యర్థ చేష్టలు, (3) వ్యర్థజ్ఞానము గలిగియుందురు.

ప్ర:— కావున జీవు లెట్లు ప్రవర్తింపవలెను?

ఉ:— ఆసురీప్రకృతిని వదలి దైవీప్రకృతినే ఆశ్రయించుచు, దైవమునుగూర్చిన ఇచ్ఛ, దైవమును గూర్చిన చేష్ట, దైవమునుగూర్చిన జ్ఞానము గలిగియుండవలెను.

అ॥ ఇక దైవీప్రకృతిగలవారి లక్షణములను రెండు శ్లోకములద్వారా చెప్పుచున్నాడు -

13. మహాత్మానస్తు మాం పార్థ దైవీం ప్రకృతిమాశ్రితాః
భజన్త్యనన్యమనసో జ్ఞాత్వా భూతాదిమవ్యయమ్.

టీక:— పార్థ = ఓ అర్జునా !, మహాత్మానః తు = మహాత్ములైతే, దైవీమ్ = దేవసంబంధమైన, ప్రకృతిమ్ = స్వభావమును, ఆశ్రితాః (సన్తః) = ఆశ్రయించినవారలై, మామ్ = నన్ను, భూతాదిమ్ = సమస్తప్రాణులకును కారణభూతుడనైనవానిగను, అవ్యయమ్ = నాశములేనివానిగను, జ్ఞాత్వా = తెలిసికొని, అనన్యమనసః = ఇతరచింతలులేనివారై, భజన్తి = సేవించుచున్నారు (భజించుచున్నారు).

తా:— ఓ అర్జునా! మహాత్ములైతే దైవీప్రకృతిని (దేవసంబంధమైన స్వభావమును) ఆశ్రయించినవారలై, నన్ను సమస్తప్రాణులకును ఆదికారణునిగను, నాశరహితునిగను ఎఱింగి వేఱొకదానియందు మనస్సునుంచనివారలై నన్నే సేవించుచున్నారు.

వ్యాఖ్య:— క్రిందటి రెండుశ్లోకములందును ఆసురీప్రకృతిని ఆశ్రయించువారి స్వభావమెట్లుండునో తెలుపబడినది. ఈ శ్లోకమందు, రాబోవు శ్లోకమందు దైవీప్రకృతి నవలంబించువారి లక్షణములు వివరింపబడినవి. దైవీప్రకృతిని★, సత్త్వగుణమును ఆశ్రయించిన మహాత్ములు పరమాత్మను అనన్యచిత్తముతో

★ దైవీప్రకృతి, ఆసురీప్రకృతి కలవారిని గూర్చి 16వ అధ్యాయములో విస్తారముగ తెలుపబడినది.

సేవించుచున్నారు. ఎందులకు సేవించుచున్నారు? వారు పరమాత్మయందు రెండు విశిష్టగుణములను చూచిరి. అవి యేవియనిన (1) ఆదికారణత్వము (2) అవ్యయత్వము. భగవానుడు సమస్త చరాచర ప్రపంచమునకు ఆదికారణుడని, నాశరహితుడని వారెఱింగిరి. ఇట్టి మహత్తరగుణములు మఱియేయితర పదార్థమందుగాని, వ్యక్తియందుగాని లేవు. పరమాత్మ సనాతనుడు, అనాదిస్వరూపుడు. తక్కిన పదార్థములన్నియు ఆద్యంతములు గలిగియున్నవి. కావున అవి అల్పములు. పరమాత్మ అవ్యయుడు. నాశములేనివాడు. తక్కినవన్నియు నాశవంతములు. క్షయిష్ణువులు. పుట్టుక, చావు కలవి. ఈ ప్రకారముగ మహనీయులు దృగ్దృశ్య పదార్థశోధనము కలవారై దేనిస్వభావ మెట్లుండునో బాగుగ విచారించి, దృశ్యమును నశ్వరముగను, పరమాత్మను శాశ్వతునిగను ఎఱింగి చరాచర జగత్తునందాతనినే పరమోత్కృష్టుడని నిశ్చయించి అనన్యచిత్తముతో వారినే సేవించుచున్నారు.

'అనన్యమనసః' - మనస్సు మఱియొకదానియందు సంలగ్నముకాక ఇతర వ్యాపకములేక ఒకే ధ్యేయమునందు నిలుకడకలిగియున్నచో దానిని అనన్యమనస్సందురు. అట్టి అనన్యమనస్సుతో పరమాత్మను ధ్యానించవలెననిన, ఇతర వస్తువులయొక్క నశ్వరత్వాది దోషములు, పరమాత్మయందలి శాశ్వతత్వాది సుగుణములు బాగుగ గ్రహించియుండవలెను. కనుకనే ఇచట 'జ్ఞాత్వా' అని చెప్పబడినది. ధ్యేయవస్తువుయొక్క పరిజ్ఞానము గలిగియున్నపుడే దానిపై విశ్వాసమేర్పడగలదు. అపుడు మాత్రమే దానిపై అనన్యమనస్సు సంభవించగలదు. అట్లే దృశ్యవస్తువులయొక్క దోషములను విచారించియు వానియెడల విరక్తి గలిగియుండినచో ఇక మనస్సు బయటకు పరుగెత్తక అంతర్ముఖమై ఒకే పరమాత్మయందు నిలుకడ గలిగియుండును. చిత్తమునందు అనన్యత్వము చక్కగ ఏర్పడగలదు.

'మహాత్మానః' - మహాత్ముడనగా నెట్టివాడో ఈ శ్లోకమున చక్కగ విశదీకరింపబడినది. 'మహాత్మా' అనునది ఒకబిరుదు. అది ప్రయత్నముచే ప్రతివారికిని లభ్యముకాగలదు. ఎవరు (1) దైవీప్రకృతిని ఆశ్రయించి (2) భగవానుని నాశరహితునిగను, ఆదికారణునిగను ఎఱింగి (3) అనన్యమనస్కులై వారిని ధ్యానించుదురో, అట్టివారు మహాత్ములు కాగల్గుదురు. కాబట్టి మహాత్మత్వమునకు జాతిమతకులగోత్రాదులతో పనిలేదు. ఎవరైన సరియే పైనదెల్పిన సల్లక్షణములు గలిగియుండినచో వారు మహాత్ములే యగుదురు. అసురప్రకృతిని ఆశ్రయించువారు, కామక్రోధాదులు కలవారు, భగవంతుని ఏకాగ్రచిత్తముతో భజింపనివారు మహాత్ము లెన్నటికిని కానేరరు. వారు అల్పాత్ములు, దురాత్ములే యగుదురు.

లోకములో భగవంతునిగూర్చి ధ్యానించువారు చాలమంది యుండవచ్చును, గాని అనన్యమనస్సుతో ధ్యానించువారు చాల అరుదు. మనస్సులో కొంతభాగము దృశ్యముపైనను, కొంతదైవముపైనను వారికి వ్యాపించుచుండును. అట్టివారు భగవత్తత్త్వమును ఇంకను బాగుగ తెలిసికొని, వారి మహిమను లెస్సగ గుర్తెఱింగి క్రమముగ దృశ్యచింతను తొలగించి అనన్యచిత్తముతో దైవమును సేవించుటను అభ్యసింపవలెను. మనస్సునందు నూటికినూరుపాళ్లు దైవత్వము (100% దైవత్వము) ఉండులాగున చూడవలెను. అట్టి మనస్సు ఇక మనస్సుగానుండక చిద్రూపముగా, దైవస్వరూపముగా, సత్త్వముగా మారిపోవును (జ్ఞచిత్తంసత్త్వముచ్యతే). అట్టి స్థితియే మోక్షము.

ప్ర:– దైవీప్రకృతిని ఆశ్రయించిన మహాత్ము లెట్లు ప్రవర్తించుదురు?

ఉ:– పరమాత్మను సమస్తభూతకోట్లకు ఆదికారణునిగను, అవ్యయునిగను ఎఱింగి అనన్యమనస్సుతో అతనిని సేవించుచుందురు.

ప్ర:– పరమాత్మ యెట్టి లక్షణములు కలవాడు?

ఉ:– (1) సమస్తప్రాణికోట్లకు ఆదికారణుడు (2) నాశరహితుడు.

ప్ర:– మహాత్ముడని ఎట్టివాడు చెప్పనగును?

ఉ:– (1) దైవీప్రకృతిని ఆశ్రయించువాడు (2) భగవత్తత్త్వ మెఱుంగువాడు (3) అట్లెఱిగి పరమాత్మను అనన్యచిత్తముతో సేవించువాడు.

ప్ర:– భగవంతునియందు అనన్యమనస్సు ఎట్లేర్పడగలదు?

ఉ:– అతని స్వరూపస్వభావములను బాగుగ తెలిసికొనినచో, అనగా, అతడు నాశరహితుడని ఆదికారణుడని యెఱింగినచో, అట్టి భగవత్పరిజ్ఞానమువలన నాతనిపై పూర్ణభక్తివిశ్వాసములు కలుగుటబట్టి ఇక మనస్సు అన్యత్రపోక అతనిపైననే నిలుచును. అదియే అనన్యమనస్సు. అనన్యమనస్సేర్పడుట కిదియే యుపాయము.

అII దైవీప్రకృతి కలవారి లక్షణముల నింకను వివరించుచున్నాడు -

14. సతతం కీర్తయన్తో మాం యతన్తశ్చ దృఢవ్రతాః
నమస్యన్తశ్చ మాం భక్త్యా నిత్యయుక్తా ఉపాసతే.

టీక:– (తే = వారు), సతతమ్ = ఎల్లప్పుడు, మామ్ = నన్నుగూర్చి, కీర్తయన్తః = కీర్తించుచు, దృఢవ్రతాః = చలింపని వ్రతములుగలవారై, యతన్తః చ = ప్రయత్నించుచు, భక్త్యా = భక్తితో, నమస్యన్తః చ = నమస్కరించుచు, నిత్యయుక్తాః = సదా నాయందుచిత్తముంచినవారలై (ఏకాగ్రచిత్తులై), మామ్ = నన్ను, ఉపాసతే = సేవించుచున్నారు.

తా:– వారు (పైన దెల్పిన దైవీప్రకృతిగలవారు) ఎల్లప్పుడు నన్నుగూర్చి కీర్తించుచు, దృఢవ్రతనిష్ఠులై ప్రయత్నించుచు, భక్తితో నమస్కరించుచు, సదా నాయందు చిత్తముంచినవారలై నన్ను సేవించుచున్నారు.

వ్యాఖ్య: – మహాత్ములగువారు పరమాత్మను అనన్యమనస్సుతో సేవింతురని పై శ్లోకమందు చెప్పబడినది. ఎట్లు సేవింతురో. ఆ పద్ధతి యిచట తెలుపబడినది. సర్వకాల సర్వావస్థలయందును వారు భగవంతుని స్మరించుచుందురు, కీర్తించుచుందురు. 'సతతమ్' అని చెప్పినందువలన ఏదియో యొక సమయమున కీర్తించుట కాదనియు, నిరంతరము కీర్తించుచుందురనియు తెలియుచున్నది. సాకారభక్తికలవారైనచో భగవంతుని నామస్మరణాదులు గావించుదురు. నిరాకారభక్తిగలవారైనచో హృదయమున ఆ పరమాత్మనుగూర్చిన మనననిదిధ్యాసనములను గావించుదురు.

వారు భగవత్ప్రాప్తికై సదా యత్నశీలురై యుందురు. ఇంద్రియనిగ్రహాదులను (శమదమాదులను) అభ్యసించుచుందురు. సోమరులైయుండరు. ప్రయత్నశీలురకు మాత్రమే దైవపదము లభ్యమగునుగాని తదితరులకుగాదని ఈ 'యతన్తశ్చ' అను పదమువలన సుస్పష్టమగుచున్నది. ప్రయత్నములేనిచో ప్రాపంచికవస్తువే సిద్ధింపకయుండ ఇక దైవ వస్తువునుగూర్చి వేఱుగ చెప్పవలెనా? వారు చేయునది

సామాన్యప్రయత్నముకాదు. 'దృఢవ్రతముల' నవలంబించి గొప్ప పట్టుదలతో పరమార్థసాధనములను గావించుదురు.

'తే ద్వన్ద్వమోహనిర్ముక్తా భజన్తే మాం దృఢవ్రతాః' (7-28) అని వారి యీ దృఢవ్రతశీలత్వమునుగూర్చి యిదివఱకే గీతాచార్యులు చెప్పియున్నారు. ఇపుడు మరల దానినే ప్రస్తావించుటబట్టి అద్దాని గొప్పతనము, అత్యావశ్యకత నిరూపితమగుచున్నది. బహుజన్మార్జిత పాపవాసనలతో, మలినసంస్కారములతోను గూడి మదించియున్న మనస్సును లొంగదీయవలెననిన సాధకుడు కొన్ని వ్రతములను తప్పక శీలించవలసియుండును. (ఉపవాసవ్రతము, మౌనవ్రతము, జపవ్రతము, ధ్యానవ్రతము, బ్రహ్మచర్యవ్రతము మున్నగునవి). అయితే దృఢవ్రతములుగ నుండవలెనేకాని దుర్బల వ్రతములుగ నుండరాదు. అనగా వానిని మధ్యమధ్య భంగమొనర్పరాదు. వ్రతములందు, నియమములందు, పరమార్థనిష్ఠయందు ఇట్టి దృఢత్వము లేనందువలననే అనేకులు ఈ మార్గమున ప్రవేశించియు బలవత్తరమగు మాయచే పరాజితులై వెనుకకు మఱలిపోవుచున్నారు. మాయ భయంకరమైన శత్రువు. అది సామాన్యాయుధములకు లొంగదు. కావున దృఢవ్రతము లను దివ్యాస్త్రములచే దానిని ఓడించవలెను.

'నిత్యయుక్తాః' - అని చెప్పుటచే వారు నిరంతరము ఏకాగ్రతతో భగవంతుని యందు చిత్తమును నెలకొల్పుచుందురని స్పష్టమగుచున్నది. అయితే 'భక్త్యా' అను పదమును గూడ చేర్చినందువలన వారు చేయు వందనముగాని, ధ్యానముగాని నిర్మల భక్తితో గూడియుండునదియే యగునని తెలియుచున్నది. భగవంతుని ధ్యానించువారు పెక్కురుండవచ్చునుగాని భక్తితో ధ్యానించువారు చాల అరుదు.

'స తు దీర్ఘరాలనైరన్తర్య సత్కారసేవితో దృఢభూమిః' అని పతంజలి మహర్షియు ప్రీతితో గూడిన ధ్యానాది నిరంతరయత్నములకే ఎక్కువ ప్రాధాన్యమొసంగియుండిరి. ఈ ప్రకారముగ నిరంతరదైవస్మరణము, దృఢవ్రతత్వము, భక్తితోగూడిన నిరంతర ధ్యానము భగవత్సాక్షాత్కారమునకు మార్గములని ఈ శ్లోకము ద్వారా వెల్లడియగుచున్నది. కావున ముముక్షువు లట్టి యాచరణను శీలించి దైవీప్రకృతికలవారై యత్నించినచో బ్రహ్మసాయుజ్యమును శీఘ్రముగ బొందగలరు.

ప్ర:– మహాత్ములగువారు భగవంతుని ఏ ప్రకారము సేవింతురు?

ఉ:– (1) ఎల్లపుడు కీర్తించుచుందురు (2) దృఢవ్రతము లవలంబించి దైవప్రాప్తికై యత్నించుచుం దురు. (3) భగవానుని భక్తితో నమస్కరించుదురు (4) చిత్తమును అన్యత్రపోనీయక పరమాత్మయందే సదా నెలకొనియుండులాగున చూచుదురు.

ప్ర:– దీనిని బట్టి భగవత్ప్రాప్తికి ఉపాయము లేవియని స్పష్టమగుచున్నది?

ఉ:– (1) నిరంతర స్మరణము (2) దృఢవ్రతసంయుక్తమగు యత్నము (3) భక్తితోగూడినవందనము, ధ్యానము (4) ఏకాగ్రతతో గూడిన నిరంతరదైవచింతనము (నిత్యయుక్తత్వము) అనునవి భగవత్ప్రాప్తికి ఉపాయములని తేలుచున్నది.

ప్ర:– భగవంతుని ఎపుడెపుడు స్మరించవలెను, కీర్తించవలెను?

ఉ:– నిరంతరము.

ప్ర:– ఎట్టి వ్రతములుగలిగి యత్నించవలెను?

ఉ:– దృఢవ్రతములుగలిగి.

ప్ర:– భగవచ్చింతన యెట్లు చేయవలెను?

ఉ:– భక్తితోగూడి.

అ॥ జనులు పెక్కు విధముల తన్ను ఉపాసించుదురని (సేవించుదురని) భగవానుడు తెలుపుచున్నాడు –

15. జ్ఞానయజ్ఞేన చాప్యన్యే యజన్తో మాముపాసతే
ఏకత్వేన పృథక్త్వేన బహుధా విశ్వతోముఖమ్.

టీక:– అన్యే అపి = మఱికొందఱును, జ్ఞానయజ్ఞేన చ = జ్ఞానయజ్ఞముచేతను, యజన్తః = పూజించుచున్నవారై, ఏకత్వేన = (తానే బ్రహ్మమను) అద్వైతభావముతోను, (కేచిత్ = మఱికొందఱును), పృథక్త్వేన = (బ్రహ్మమే వివిధ దేవతాదిరూపమున నున్నదను) ద్వైతభావముతోను, బహుధా = ఇట్లనేకవిధములుగ (లేక వివిధరూపముల), విశ్వతోముఖమ్ = విశ్వరూపుడనగు (సర్వాత్మకుడనగు), మామ్ = నన్ను, ఉపాసతే = ఉపాసించుచున్నారు.

తా:– మఱికొందఱు జ్ఞానయజ్ఞముచే పూజించుచున్నవారై (తానే బ్రహ్మమను) అద్వైతభావముతోను, ఇంకకొందఱు (బ్రహ్మమే వివిధదేవతాది రూపమున నున్నది. ఆ దేవతలలో నేనొకదానిని సేవించుచున్నానను) ద్వైతభావముతోను ఇట్లనేక విధములుగ (లేక వివిధరూపముల) నన్ను ఉపాసించుచున్నారు.

వ్యాఖ్య:– మహాత్ములగువారు సదా పరమాత్మను భజించుచుందురని ఇంతదనుక చెప్పబడినది. వారిలో కొందఱు అద్వైతభావనతోను, మఱికొందఱు ద్వైతభావనతోను, ఇంక కొందఱు వేఱు వేఱు విధములుగను వారి వారి సంస్కారము ననుసరించి భగవంతుని సేవించుచుందురని ఇట చెప్పబడుచున్నది. ఋజువుగగాని, వక్రముగగాని ఎట్లు ప్రవహించినను నదులన్నియు ఎట్టకేలకు సముద్రమును చేరియే తీరును. అట్లే అధ్యాత్మమార్గమున యత్నశీలురగువారున్ను భిన్నభిన్నరీతుల భగవానుని సేవించినను, ప్రయత్నమును విడనాడనిచో, తుట్టతుదకు అందఱున్ను ఆ భగవద్రూపలక్ష్యమునే చేరగలరు. అయితే లక్ష్యమందు ఏకాగ్రత, భక్తి అందఱికిని యుండవలెను.

'జ్ఞానయజ్ఞేన' – జ్ఞానయజ్ఞమనగానేమి? "బ్రహ్మసత్యం జగన్మిథ్యా జీవో బ్రహ్మైవనాపరః" – బ్రహ్మమొకటియే సత్యము, దృశ్యజగత్తంతయు లేనిది. జీవుడు వాస్తవముగ బ్రహ్మమేకాని అన్యుడుకాదు అను నిశ్చయము గలిగియుండుటయే జ్ఞానయజ్ఞము నాచరించుటయగును. ఇదియే అద్వైతబ్రహ్మభావము. 'తత్త్వమసి' మహావాక్యచింతన. 'సోహం' భావము. ఇట్టి జ్ఞానయజ్ఞమాచరించువాడు అద్వైతభావము గల్గి తానే బ్రహ్మమను చింతనగల్గియుండును. ఈ జ్ఞానయజ్ఞముయొక్క శ్రేష్ఠత్వమును గూర్చి, ఆవశ్యకతనుగూర్చి శ్రీకృష్ణమూర్తి గీతయం దచటచట వక్కాణించుచునే యున్నారు. తుట్టతుదకు గీతను సమాప్తిచేయుచు "జ్ఞానయజ్ఞేన తేనాహమిష్టస్స్యామితి మే మతిః –" గీతాధ్యయనము చేయువానిచేత, జ్ఞానయజ్ఞముచే నేనారాధింపబడినవాడ నగుదును – అని పలికి జ్ఞానయజ్ఞముయొక్క మాహాత్మ్యమును

చాటినవారైరి. సర్వము ఒకే భగవత్స్వరూపమనియు, ఆ స్వరూపము తన ఆత్మకంటె నన్యముకాదనియు, ప్రతివారును ఏదియో యొకకాలమున తెలిసికొనియే ముక్తినొందవలసియుందురు. ఇదియే జ్ఞానయజ్ఞము.

'విశ్వతోముఖమ్' - ప్రపంచమంతట ముఖముకలవాడు - సర్వాత్మస్వరూపుడు - అని భగవాను డిచట వర్ణించబడిరి. ఈసత్యమెఱింగినచో ఇక ఎవడును ఏ పాప కార్యమును చేయజాలడు. ఏలయనిన అన్నిచోట్లను భగవానునిముఖము, దృష్టి, అస్తిత్వము కలదు. ఆతడు సర్వమును వీక్షించుచునేయున్నాడు. కావున 'విశ్వతోముఖమ్' అను ఈ పదమును జనులు మఱల మఱల జ్ఞాపకము చేసికొనుచు దుష్కృత్యములనుండి విరమించవలెను.

ప్ర:- జనులు భగవంతుని ఏయే ప్రకారముగ సేవించుచుందురు?

ఉ:- కొందఱు జ్ఞానయజ్ఞముద్వారా అద్వైతభావముతోను, మఱికొందఱు ద్వైతభావముతోను ఈ ప్రకారముగ వారివారి రుచులనుబట్టి పలువిధములుగ అర్చించుచున్నారు.

అ॥ ఈ ప్రపంచమున సమస్తము పరమాత్మయే అని నాలుగు శ్లోకములద్వారా వచించుచున్నాడు -

16. అహం క్రతురహం యజ్ఞః స్వధాహమహమౌషధమ్
మన్త్రో௨హమహమేవాజ్యమహమగ్నిరహం హుతమ్.

టీక:- అహమ్ = నేను, క్రతుః = క్రతువును (వేదోక్తమైన అగ్నిష్టోమాదులను), అహమ్ = నేను, యజ్ఞః = యజ్ఞమును, అహమ్ = నేను, మన్త్రః = మంత్రమును, అహమ్ = నేను, ఆజ్యమ్ = హోమద్రవ్యమును (హవిస్సు), అహమ్ = నేను, అగ్నిః = అగ్నిహోత్రమును, అహ మేవ = నేనే, హుతమ్ (అస్మి) = హోమకర్మమును (అయియున్నాను).

తా:- (అగ్నిష్టోమాదిరూప) క్రతువు నేనే, యజ్ఞము నేనే, పితృదేవతలకిచ్చు అన్నము నేనే, ఔషధము నేనే, మంత్రము నేనే, హవిస్సు నేనే, అగ్ని నేనే, హోమకర్మమున్ను నేనే, అయియున్నాను.

వ్యాఖ్య:- పరమాత్మ సర్వవ్యాపకులై, విశ్వతోముఖులై సమస్తపదార్థము లందును వెలయుచున్నారను వాక్యమును ఋజువుచేయుటకై దృష్టాంతరూపముగ యజ్ఞమనుక్రియనుగైకొని, దానియందుపయోగింపబడు సమస్తమున్ను భగవత్స్వరూపమేయని వచించుచున్నారు. అదేవిధముగ ప్రపంచమందలి సమస్తపదార్థములున్ను భగవద్రూపములేయని దీనినిబట్టి తెలిసికొనవలయును. అట్లు తెలిసికొని భక్తిభావసంయుతులై, క్రమముగ అట్టి సర్వాత్మభావమును అనుభూత మొనర్చుకొనవలెను.

17. పితా௨హమస్య జగతో మాతా ధాతా పితామహః
వేద్యం పవిత్ర మోంకార ఋక్సామయజురేవ చ.

టీక:- అస్యజగతః = ఈజగత్తునకు, అహమ్ఏవ = నేనే, పితా = తండ్రిని, మాతా = తల్లిని, ధాతా = రక్షకుడను (లేక, కర్మఫలప్రదాతను), పితామహః = తాతను, వేద్యమ్ = తెలిసికొనదగిన వస్తువును, పవిత్రమ్ = పావనపదార్థమును, ఓంకారః = ఓంకారమును (ప్రణవస్వరూపుడను), ఋక్సామయజుఃచ = ఋగ్వేద, యజుర్వేద, సామవేదములను (అయియున్నాను).

తా:– ఈ జగత్తునకు నేనే తండ్రిని, తల్లిని, సంరక్షకుడను (లేక, కర్మఫలప్రదాతను), తాతను; మఱియు తెలిసికొనదగిన వస్తువును, పావనపదార్థమును, ఓంకారమును, ఋగ్వేద, యజుర్వేద, సామవేదములును అయియున్నాను.

వ్యాఖ్య:– లౌకిక బంధువులతో జీవుని సంబంధము తాత్కాలికమైనది. స్థూలదేహమున్నంతవఱకే వారితో సంబంధముండును. దాని పతనముతో ఆ సంబంధము ముగిసిపోవును. తల్లిగాని, తండ్రిగాని, తాతగాని, సోదరుడుగాని అంతియే. కాని భగవత్సంబంధ మట్టిదికాదు. భగవానుడను తండ్రి, తల్లి, తాత - ఎల్లప్పుడును మనవెంటనుండును. దైవముతో మనసంబంధము స్థూలదేహపరిమితముకాదు. అది శాశ్వతమైనది. భగవానుడు నిత్యుడు. కావున అట్టి నిత్యబంధువునే జీవు డధికముగ నాశ్రయించవలెను. పరమాత్మయే తండ్రిగ, తల్లిగ, సంరక్షకుడుగ గలవాడు నిర్భయుడై ఆనందమయుడై యుండవలెను. ఏలయనిన, శాశ్వతశాంతిని, బంధవిముక్తిని భక్తుడగు ఆతనికి భగవానుడు గలుగజేయగలడు. అట్టి లోకైక బంధువును ఆశ్రయించినవారికి, శరణు జొచ్చినవారికి వారు కైవల్యమును ప్రసాదించి, మహోపకారమొనర్చగలరు. కాబట్టి మాతృభక్తి, పితృభక్తి మొదలగునవి కలిగియున్నప్పటికిని వానితోబాటు భగవద్భక్తి గూడ అలవఱచుకొనవలెను.

'వేద్యమ్' - అని చెప్పినందువలన ఈ ప్రపంచమున అనేకవస్తువులున్నప్పటికిని ముఖ్యముగ తెలిసికొనదగిన వస్తువు ఆ పరమాత్మయే యని స్పష్టమగుచున్నది. దేనిని తెలిసికొనినచో జీవునకు ఆత్యంతికశాంతి, జన్మరాహిత్యము కలుగునో అద్దానినే తెలిసికొనవలెను. అదియే పరమాత్మవస్తువు. అన్నిటిని తెలిసికొనినప్పటికిని, ఆ పరమాత్మను తెలిసికొననిచో మనుజు డేమియు తెలిసికొననివాడేయగును. పరమాత్మను తెలిసికొనినచో, దృశ్యవస్తువుల వేనిని తెలిసికొనకున్నను సమస్తము తెలిసికొనినవాడే యగును.

'ఓంకారః' - ఓంకారము (ప్రణవము) భగవంతుని నామమైయుండుటవలన దానినుచ్చరించి, అద్దాని యర్థమును మననము చేసినచో అద్భుతఫలితములు చేకూరగలవు. మంత్రములన్నింటిలోను ప్రణవమంత్రము శ్రేష్ఠతమమై యొప్పుచున్నది.

ఈ ప్రకారముగ జగత్తునందలి సమస్తము భగవత్స్వరూపమే యని యెంచి భక్తి భావము గలిగియుండవలెను.

ప్ర:– ఈ ప్రపంచమున సర్వులకును తండ్రియెవరు ? తల్లియెవరు ? తాతయెవరు ? సంరక్షకుడెవరు?

ఉ:– పరమాత్మయే.

ప్ర:– ఈ ప్రపంచమున తెలిసికొనదగిన వస్తువేది?

ఉ:– పరమాత్మయే.

ప్ర:– అన్నిటికంటెను పవిత్రమైన వస్తువేది?

ఉ:– పరమాత్మయే.

ప్ర:– ఇంకను విశేషముగ ఏ యే రూపముల పరమాత్మ వెలుగొందుచున్నారు?

ఉ:– ప్రణవ (ఓంకార) రూపమున, ఋక్, యజుస్సామాది వేదరూపమున వెలయుచున్నారు.

18. గతిర్భర్తా ప్రభుస్సాక్షీ నివాసశ్శరణం సుహృత్ ప్రభవః ప్రలయః స్థానం నిధానం బీజమవ్యయమ్.

టీక:– *గతిః* = పరమలక్ష్యమును, *భర్తా* = భరించువాడును, *ప్రభుః* = ప్రభువును (నియామకుడును), *సాక్షీ* = సాక్షియు, *నివాసః* = ప్రాణుల నివాసమును, *శరణమ్* = శరణ మొందదగినవాడును, *సుహృత్* = ప్రతిఫలముగోరక హితమొనర్చువాడును, *ప్రభవఃస్థానమ్ ప్రలయః* = సృష్టిస్థితిలయములకు కారణమైనవాడును, *నిధానమ్* = నిక్షేపమును, *అవ్యయమ్* = నాశరహితమైన, *బీజమ్* = బీజమును (మూలకారణమును) నేనే అయియున్నాను).

తా:– పరమలక్ష్యమును, భరించువాడును, ప్రభువును, సాక్షియు, ప్రాణుల నివాసమును, శరణమొందదగినవాడును, హితమొనర్చువాడును, సృష్టిస్థితిలయకర్తయు, నిక్షేపమును, నాశరహితమైన బీజమును (మూలకారణమును) నేనే అయియున్నాను.

వ్యాఖ్య:– 'గతి' - జీవులకు పరమగతి, పరమప్రాప్యస్థానము పరమాత్మయే. ఆత్మేతరమగునది యంతయు నశ్వరమైనది, కనుక సద్వస్తువగు శాశ్వత ఆత్మయే సమస్తజీవులకును పరమగతియైయున్నది.

'భర్తా' - సర్వులను భరించువాడు, పోషించువాడు పరమాత్మ. కావున ఆతడు జగద్భర్త. స్త్రీలకును, పురుషులకును, సర్వులకును 'భగవానుడు' భర్త (భరించువాడు). స్త్రీలు తమ పతిసేవ చేయుచున్నను జగత్పతియెడలకూడ అనన్యభక్తిగలిగియుండవలెను. వైధవ్యమును బొందిన స్త్రీలు దుఃఖమునందు కాలముగడుపక ధైర్యమువహించి పరమాత్మనే తమభర్తగ నెంచుకొని ధ్యానించుచు, సేవించుచు నుండవలెను.

'ప్రభుః' - పరమాత్మ లోకైక ప్రభువు. మహాచక్రవర్తి. విశ్వసామ్రాట్. బ్రహ్మాండనాయకుడు. కావున చిన్నచిన్న రాజ్యములకు, గ్రామములకు, ప్రాంతములకు, వెయ్యేల, భూలోకమంతటికిని ప్రభువైనప్పటికిని, గర్వించక ఆ మహాప్రభువు యెడల భక్తిప్రపత్తులను గలిగియుండుట శ్రేయస్కరము.

'సాక్షీ' - భగవానుడు సర్వజగత్సాక్షి. జనులుచేయు పుణ్యపాపములను సాక్షిగా నుండి గమనించుచున్నారు. కాబట్టి ఆచరణయందు జనులు బహుజాగరూకులై యుండి ధర్మమార్గమునే చేబట్టవలెను.

'నివాసః' - సర్వజీవులకును భగవానుడే నివాసము. ఏలయనగా బ్రహ్మాడములన్నియు వారి కుక్షియందే వర్తించుచున్నవి. జనులు తమ నివాసమేదియని యడిగినపుడు ఇల్లు, వాకిలి, ఊరు అని చెప్పుకొనుచుందురు. కాని వాస్తవముగ ఈ సమస్తము ఎద్దానియందు నిలుకడగలిగియున్నదో అట్టి పరమాత్మయే వారినివాసమగును. ఈ సమస్తము దేనియందు నిలుకడగలిగియున్నదో అట్టి పరమాత్మయే సర్వులకును నివాసమగును.

'శరణమ్' - భగవానుడే పరమశరణ్యుడు. నశ్వరప్రాపంచికవస్తువులను శరణుబొందినచో నేమి ప్రయోజనము? శాశ్వత మోక్షఫలమొసంగు సర్వేశ్వరునే శరణుబొందవలెను.

'సుహృత్' - పరమాత్మ సర్వులకును ప్రాణమిత్రుడు. ప్రతిఫలము గోరక మేలు చేయువాడు. ప్రాపంచిక మిత్రులతో సంబంధము ఈ దేహముతో తీరిపోవును. కాని శాశ్వతమిత్రుడగు భగవానునితో సంబంధము ఎల్లకాలములం దుండునది. కావున వారితో మైత్రిని సంపాదించుకొనుట అత్యుత్తమము.

'ప్రభవః ప్రలయః స్థానమ్' - జగత్తుయొక్క సృష్టిస్థితిలయకారకుడు ఆ పరమాత్మయే. ఏలయనిన వారి సన్నిధానమున ఈ సమస్తప్రపంచమున్ను సూదంటురాతిచెంత సూదివలె క్రియావంతమగుచున్నది.

'నిధానమ్' - భగవానుడు సర్వజీవులకును గొప్పనిక్షేపము (Store - house). ప్రళయకాలమందును సమస్తము వారియందే అణగియుండునుగావున.

'బీజమవ్యయమ్' - సమస్తజగత్తునకును, సర్వప్రాణులకును, బీజస్వరూపుడు, కారణభూతుడు పరమాత్మయే. కావున ప్రతిజీవియు తాను ఏ కులమందు బుట్టినను, ఏ జాతియందు జనించినను, స్త్రీయైనను, పురుషుడైనను, తన జన్మస్థానము, తనగోత్రము, తనపుట్టిల్లు, ఆ పరమాత్మయేయను విశ్వాసముగల్గి ధైర్యము వహింపవలెను. తాను అల్పుడనని, శక్తిహీనుడనని, దుర్బలుడనని ఏకాలమందును తలంపరాదు. మఱియు వృక్షము బీజముకంటె అన్యముకాదు. అట్లే జీవుడు తన బీజమగు (కారణమగు) పరమాత్మకంటె వేఱుకాదు. కావున జీవుడు తన ఉపాధి యెంత అల్పమై యున్నప్పటికిని తన మూలము (బీజము) అగు పరమాత్మను స్మరించుకొని మహద్ధైర్యయుతుడై యుండవలెను. 'అవ్యయం బీజం' అని చెప్పినందువలన ఆ పరమకారణము నాశరహితమైనదని స్పష్టమగుచున్నది.

ప్ర:– జీవులకు పరమగతియేది ? సర్వులకు భర్తయెవరు ? నివాసమెద్ది ? సాక్షియెవడు ? శరణుడు, మిత్రుడు ఎవడు ? సృష్టిస్థితిలయకారకుడెవడు ? సమస్తమునకు నిక్షేపమెద్ది ? బీజమేది ?

ఉ:– పరమాత్మయే.

19. తపామ్యహమహం వర్షం నిగృహ్ణామ్యుత్సృజామి చ
అమృతం చైవ మృత్యుశ్చ సదసచ్చాహమర్జున.

టీక:– అర్జున = ఓ అర్జునా!, అహమ్ = నేను, తపామి = (సూర్యకిరణములచే) తపింపజేయుచున్నాను, అహమ్ = నేను, వర్షమ్ = వర్షమును, ఉత్సృజామి = కురిపించుచున్నాను, నిగృహ్ణామిచ = (వర్షమును) నిలుపుదలయు చేయుచున్నాను, అమృతమ్ చ = మరణరాహిత్యమున్ను, మృత్యుఃచ = మరణమున్ను, సత్ = సద్వస్తువున్ను, అసత్ చ = అసద్వస్తువున్ను, అహమ్ ఏవ (అస్మి) = నేనే (అయియున్నాను).

తా:– ఓ అర్జునా! నేను (సూర్యకిరణములచే) తపింపజేయుచున్నాను మఱియు వర్షమును కురిపించుచున్నాను. వర్షమును నిలుపుదలచేయుచున్నాను. మరణరాహిత్యమున్ను (మోక్షమున్ను), మరణమున్ను నేనే. అట్లే సద్వస్తువున్ను, అసద్వస్తువున్ను నేనే (అయియున్నాను).

వ్యాఖ్య:– సమస్త జగత్తునకు, సమస్త జగత్క్రియలకును ఆధారభూతుడు పరమాత్మయే కనుక, సర్వము వారివలననే జరుగుచున్నదని యిట వచింపబడినది. దృష్టాంతమున కిచట మూడుక్రియలు చెప్పబడినవి. (1) ఎండకాయించునది (2) వర్షమును కురిపించునది (3) వర్షమును బిగబెట్టునది వారే అని

కాబట్టి అతివృష్టిగాని, క్షామముగాని లేక మఱి యే ఆపదకాని సంభవించినపుడు తన్నివారణమునకు సర్వేశ్వరుడుతప్ప జీవులకు వేఱుశరణ్యము లేదని స్పష్టడుచున్నది.

రజ్జుసర్పభ్రాంతియందు సర్పము రజ్జువుకంటె అన్యముకానట్లు, ఆభాసరూపమగు ఈ జగత్తు అధిష్ఠానమగు పరమాత్మకంటె వేఱుకాదు. కనుకనే పరమార్థదృష్టియందు అమృతము, మృత్యువు, సత్తు, అసత్తు అన్నియు ఒకే దైవస్వరూపముగ నిచట వర్ణింపబడినది. వాస్తవముగ భగవానుడు సద్వస్తువేకాని అసద్వస్తువుకాదు. అమృతస్వరూపుడేకాని మృత్యురూపుడుకాడని గ్రహించునది.

ప్ర:– గ్రీష్మము, వర్షము, వర్షాభావము ఎవరివలన కలుగుచున్నవి?

ఉ:– పరమాత్మవలన.

అ॥ కామ్యభావనతో గూడి స్వర్గాదిభోగములకై యజ్ఞాదులను సల్పుట ఉత్తమముకాదనియు, అట్టివారు జననమరణములనుండి తప్పించుకొనజాలరనియు రెండుశ్లోకముల ద్వారా వచించుచున్నాడు -

20. త్రైవిద్యా మాం సోమపాః పూతపాపా
యజ్ఞై రిష్ట్వా స్వర్గతిం ప్రార్థయన్తే
తే పుణ్యమాసాద్య సురేన్ద్రలోక
మశ్నన్తి దివ్యాన్దివి దేవభోగాన్.

టీక:– త్రైవిద్యాః = మూడువేదముల నధ్యయనముచేసినవారును, సోమపాః = సోమపానముచేసినవారును, పూతపాపాః = పాపకల్మషముతొలగినవారును, యజ్ఞైః = యజ్ఞములచే, మామ్ = నన్ను, ఇష్ట్వా = పూజించి, స్వర్గతిమ్ = స్వర్గప్రాప్తిని, ప్రార్థయన్తే = వేడుకొనుచున్నారు, తే = వారు, పుణ్యమ్ = పుణ్యఫలమగు (లేక, పవిత్రమగు), సురేన్ద్రలోకమ్ = దేవేంద్రలోకమును, ఆసాద్య = పొంది, దివి = ఆ స్వర్గమందు, దివ్యాన్ = దివ్యములైన, దేవభోగాన్ = దేవభోగములను, అశ్నన్తి = అనుభవించుచున్నారు.

తా:– మూడువేదముల నధ్యయనముచేసినవారును, కర్మకాండను సకామభావముతో నాచరించువారును, సోమపానము గావించినవారును, పాపకల్మషము తొలగినవారునగు మనుజులు యజ్ఞములచే నన్ను పూజించి స్వర్గముకొఱకై ప్రార్థించుచున్నారు. వారు (మరణానంతరము) పుణ్యఫలమగు దేవేంద్రలోకమునుబొంది, అట్టి స్వర్గమందు దివ్యములగు దేవభోగముల ననుభవించుచున్నారు.

వ్యాఖ్య:– వేదముల నభ్యసించినను కొందఱు అందుచెప్పబడిన సకామకర్మలను మాత్రమే (పూర్వభాగమునే) అవలంబించి యజ్ఞయాగాదులద్వారా భగవంతుని అర్చించి తత్ఫలితముగ స్వర్గాది పుణ్యలోకములను బొందుచున్నారు. అచట పుణ్యఫలము ననుభవించినపిదప మఱల భూలోకమందు జన్మించుచున్నారు. అట్టి సకామ భక్తులను గూర్చి యిచట చెప్పబడినది. వీరు మోక్షముకొఱకై ప్రయత్నింపక స్వర్గాది భోగములకొఱకే ప్రయత్నించువారగుదురు. కాబట్టి పరమార్థదృష్టియందు పూర్ణవికాసము కలిగినవారు కారు. ఏలయనగా, అది స్వర్గమైనను, లేక ఏ యితర పుణ్యలోకమైనను పునరావృత్తి కలిగియున్నదేయని ఇదివరలో భగవానుడు తెలిపియున్నారు.

'ఆ బ్రహ్మభువనాల్లోకాః పునరావర్తినోఽర్జున', కనుక అట్టివారు జననమరణసంసారచక్రము నుండి తప్పించుకొనినవారుకాదు. బంగారుసంకెళ్ళచే బంధింపబడినవారని వారినిగూర్చి చెప్పవచ్చును. ఏలయనిన, వారు సంసారకారాగృహమున పడియున్నవారే యగుదురు. ఏది జననమరణములనుండి తప్పించగల్గునో అదియే సర్వులకును ఉత్తమమైనది. ముముక్షువులకు ఆచరణీయమైనది. అదియే ఆత్మపదము, బ్రహ్మపదము.

'మాముపేత్యతు కౌన్తేయ పునర్జన్మ న విద్యతే', అట్టి బ్రహ్మపదమునొందినవారికిక జన్మలేదు; సంసృతిలేదు. కాబట్టి పునరావృత్తిరహితమగు అట్టి పరమాత్మపదమును బొందుటకే విజ్ఞుడు యత్నించవలెనుగాని క్షయశీలములై పునరావృత్తిసహితములైనట్టి స్వర్గాది లోకములనుగాదు. వేదములందు సకామ, నిష్కామకర్మలను రెండిటినిగూర్చి చెప్పబడినను, వారందఱు సకామకర్మలనే అవలంబించి సంసారమును తిరిగి కొనితెచ్చుకొనుచున్నారు. యజ్ఞాది పుణ్యకార్యములచే వారిపాప మొకింత క్షయించినను, ఆ పాపక్షయమును చిత్తశుద్ధిద్వారా మోక్షాన్వేషణకు ఉపయోగించుకొనినయెడల వారెంతయో మహత్తరమగు శ్రేయమును బొందగలిగియుండెడివారు. కాని వారట్లు చేయక తిరిగి నశ్వరములగు స్వర్గాదిభోగములనే కాంక్షించుచున్నారు. అట్టి సకామదృష్టికలిగియున్నవారి విధానమును గీతాచార్యులు 2వ అధ్యాయమున లెస్సగ ఖండించియున్నారు★.

స్వర్గభోగములు భూలోకభోగములకంటె కొంతమెరుగైనను, వానివలన సంసారబంధము తొలగనందుచేతను, ఇంకను దృఢతరమగుటచేతను మోక్షమునకు ప్రతిబంధములగుటవలన విజ్ఞులకవి వాంఛనీయములుకావు.

'ప్రార్థయన్తే' - అని చెప్పినందువలన వారు స్వర్గపదవికై ఎంతయో ఆసక్తితో ప్రార్థించుచున్నారని, అభిలషించుచున్నారని బోధపడుచున్నది. అట్టి ప్రార్థనను భోగముల కొఱకుగాక యోగముకొఱకు చేసినచో మానవుడెప్పుడో మోక్షమును బొంది యుండెడివాడు. కావున ప్రార్థనచేయదలంచుచో మోక్షముకొఱకై ప్రార్థించుదురుగాక! భోగముల కొఱకుగాదు. అయితే ఈ యజ్ఞయాగాదులు వేదములం దేల చెప్పబడినవి యనగా పాపాచరణను తొలగించి జనులకు అధ్యాత్మమార్గమున త్రిప్పుటకొఱకే యగును. పుణ్యమందాసక్తిని గలుగజేయుటకే యగును. కాని అది చాలదు. పుణ్యమునొకింత ఆర్జించినను, గమ్యస్థానమగు పరమాత్మను జేరువఱకు సాధనలను అభివృద్ధిపఱచుకొనుచునే పోవలెను. కావున సకామకర్మనుదాటి నిష్కామకర్మను ఏనాడైనను మనుజుడు చేబట్టవలసియేయుండును. ఆ పని యెంత శీఘ్రముగ జరిగిన అంతమేలు. కనుకనే సకామకర్మలను, స్వర్గభోగాదులను భగవానుడు గీతయందు నిశితముగ విమర్శించి, నిష్కామకర్మాదులనే ప్రోత్సహించిరి.

ప్ర:- సకామకర్మరూపములగు యజ్ఞయాగాదుల నాచరించుటవలన కలుగు ఫలితమేమి ?

ఉ:- స్వర్గలోకప్రాప్తి.

21. తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం
క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి।
ఏవం త్రయీధర్మ మనుప్రపన్నా
గతాగతం కామకామా లభన్తే.

★ కామాత్మానః స్వర్గపరా..., ॥ ... సమాధౌ న విధీయతే। (2-43,44)

టీక:— తే = వారు, తమ్ = ఆ, విశాలమ్ = విశాలమైన, స్వర్గలోకమ్ = స్వర్గలోకమును, భుక్త్వా = అనుభవించి, పుణ్యే = పుణ్యము, క్షీణే (సతి) = అంతరింపగా, మర్త్యలోకమ్ = (ఈ) మనుష్యలోకమును, విశన్తి = ప్రవేశించుచున్నారు; ఏవమ్ = ఈ ప్రకారముగా, త్రయీధర్మమ్ = వేదోక్తధర్మమును (కర్మమును), అనుప్రపన్నాః = (ఫలాపేక్షతో) అనుష్ఠించువారైన, కామకామాః = కామాభిలాషులు (విషయేచ్ఛగలవారు), గతాగతమ్ = రాకడపోకడలను (జననమరణములను), లభన్తే = పొందుచున్నారు.

తా:— వారు (అట్టి స్వర్గాభిలాషులు) విశాలమగు స్వర్గలోకము ననుభవించి పుణ్యము క్షయింప తిరిగి మనుష్యలోకమున జన్మించుచున్నారు. ఈ ప్రకారముగ (సకామముగ) వేదోక్తకర్మమును అనుష్ఠించునట్టి ఆ భోగాభిలాషులు రాకడపోకడలను (జననమరణములను) పొందుచున్నారు.

వ్యాఖ్య:— అట్లు సకామముగ వేదోక్తములగు యజ్ఞయాగాదులను ఆచరించువారు స్వర్గలోకమునుబొంది, అట దేవభోగముల ననుభవించి, పుణ్యము క్షయించిన మీదట మఱల భూలోకమున పుట్టుచున్నారు. ఈ ప్రకారముగ సకామకర్మములను శరణుబొందువారగు భోగాభిలాషులు మఱలమఱల పుట్టుచు చచ్చుచు నుందురని వచింపబడినది. పుణ్యముగాని పాపముగాని, అనుభవించినకొలది క్షయించుచుండును. దీనినిబట్టి ఆ స్వర్గాదిలోకములందును జీవునకు శాశ్వతస్థితి గలుగనేరదని స్పష్టమగుచున్నది. 'విశాలమ్' అని చెప్పినందువలన, ఆ స్వర్గలోకము భూలోకముకంటె ఒకింత విస్తీర్ణముగ నుండవచ్చుగాక! అంతమాత్రముచేత దాని గొప్పతనమేమి ? అచట మోక్షప్రయత్నము చేయుటకు అవకాశము లేదు. పైగా అచటి భోగాదులకు మోక్షము చుక్కెదురు. స్వర్గాదులన్నియు కర్మానుభవలోకములు. మోక్షప్రయత్నము భూలోకమందే సాధ్యపడునని, ఒక్కమానవునికే అట్టి ప్రజ్ఞ భగవానుడొసంగెననియు శాస్త్రములు చెప్పుచున్నవి. కాబట్టి ఈ అమూల్య మానవజీవితమును ఆవాగమములతో గూడిన సంసారముకొఱకు గాక మోక్షముకొఱకే వినియోగించువాడు ధన్యుడు. లేకున్న మఱల ఏ లోకమందును ఇట్టి సదవకాశ మాతనికి లభింపనేరదు.

వేదోక్తకర్మమును ఆచరించుట మంచిదేకాని సకామముగ (ఫలాపేక్షతో) నాచరించుట ఉత్తమముకాదు. ఆ వేదధర్మములందును యజ్ఞయాగాది కర్మకాండ సంబంధములైన వానికంటె, ఉపాసనాకాండ సంబంధములైనవి, వానికంటె జ్ఞానకాండ సంబంధములైనవి క్రమముగ ఉత్తమోత్తములై యుండును. సకామముగను, భోగానుభవముకొఱకును ఆచరించు కర్మములవలన జీవునకు బంధవిముక్తిగాని, పరమార్థోన్నతిగాని కలుగనేరవు. కాబట్టి నిష్కామముగనే, దైవప్రాప్తికొఱకే ఆచరించవలెను.

'గతాగతం కామకామా లభన్తే' అని చెప్పినందువలన కోరికలు కలవారు, కామమునకు (భోగమునకు) దాసులు జననమరణములను బొందుచు ఈ సంసారచక్రమునుండి తప్పించుకొనజాలరని స్పష్టమగుచున్నది. ఈవాక్యమును ముముక్షువులు సదా జ్ఞాపకముంచుకొని కోరికలను పూర్తిగ విడనాడవలెను. సకామబుద్ధిని త్యజించవలెను. ఈ ప్రపంచములో ఎవడును దుఃఖమును కోరుటలేదు. జననమరణములను వాంఛించుటలేదు. అయినను జననమరణములను కలుగజేయు పనులనే చేయుచున్నారు. ఏలయనగా, సంసృతికి, రాకపోకడలకు కారణమేమి? విషయవాంఛయే, కామమే, భోగాభిలాషయే. 'కామకామి'యే సంసారమందుపడి రాకడపోకడలను పొందుచుండునని భగవానుడిచట సెలవిచ్చియున్నారు. కాబట్టి చావుపుట్టుకలను తప్పించుకొనదలంచువారీకామమునకు, స్వర్గాదిభోగానుభవమునకు, కోరికలకు

అతిదూరమున నుండవలెను. కామము ముముక్షువునకు మహాఘోరశత్రువని శ్రీకృష్ణమూర్తి లోగడ అనేకసార్లు చెప్పియేయుండిరి. ఆ విషయమునే మఱల నిచట స్పష్టపఱచిన వారైరి.

ప్ర:– యజ్ఞాదులను, సకామముగ నాచరించువారు స్వర్గమును బొంది అచట ఎంతకాలముందురు?

ఉ:– పుణ్యము క్షయింపనంతవఱకు.

ప్ర:– తదుపరి ?

ఉ:– (పుణ్యము క్షయింప) భూలోకమున జన్మించుదురు.

ప్ర:– కోరికలు కోరువారికి, భోగాభిలాషులకు లభించు ఫలమేమి ?

ఉ:– జననమరణములు ('గతాగతమ్')

ప్ర:– కాబట్టి జననమరణములనుండి తప్పించుకొనుటకు ఉపాయమేమి?

ఉ:– కోరికలు లేకుండుటయే, కామవివర్జనమే, విషయవాంఛారాహిత్యమే.

ప్ర:– స్వర్గలోక మెట్టిది?

ఉ:– (1) విశాలమైనది (2) భోగానుభవముతో గూడినది (3) పుణ్యక్షయము అవధిగాగలది.

అ॥ నిర్మలభక్తియొక్క ఫలితమును వచించుచున్నాడు –

22. అనన్యాశ్చిన్తయన్తో మాం యే జనాః పర్యుపాసతే
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్.

టీక:– యేజనాః = ఏ జనులు, అనన్యాః = ఇతరభావములేనివారై, మామ్ = నన్ను, చిన్తయన్తః = చింతించుచు, పర్యుపాసతే = ఎడతెగక ధ్యానించుచున్నారో, తేషామ్ = అట్టి, నిత్యాభియుక్తానామ్ = ఎల్లప్పుడు నాయందే నిష్ఠగలవారియొక్క, యోగక్షేమమ్ = యోగక్షేమములను, అహమ్ = నేను, వహామి = వహించుచున్నాను.

తా:– ఎవరు ఇతర భావములు లేనివారై నన్ను గూర్చి చింతించుచు ఎడతెగక ధ్యానించుచున్నారో, ఎల్లప్పుడు నాయందే నిష్ఠగల్గియుండు అట్టివారియొక్క యోగక్షేమములను నేను వహించుచున్నాను.

వ్యాఖ్య:– ఇది గీతలో చాలముఖ్యమైన శ్లోకము. దాదాపు గీతయొక్క మధ్యభాగమున నుండుటవలన ఇది గీతాకుసుమమాలయందు, లేక గీతారత్నమాలయందు మధ్యమణియై హృదయస్థానము నలంకరించుచున్నది. భక్తులకు ఈ శ్లోకముద్వారా భగవాను డభయమొసంగినారు. నిరంతరము తాము పరమాత్మ చింతనచేయుచుండుచో తమయొక్క అవసరములను తీర్చువారెవరని భక్తులు శంకించుదురేమోయని తలంచి 'అపనిని నేనే వహించెదన'ని భగవాను డిచట సెలవిచ్చిరి. 'యోగ' మనగా కావలసిన పదార్థమును సమకూర్చుట, 'క్షేమ' మనగా దానిని సంరక్షించుట. ఈ ప్రకారముగ భక్తునియొక్క

యోగక్షేమములను తాను వహించెదనని, భగవానుడు హామీనిచ్చెను. అయితే ఆ భక్తుడెట్లుండవలెనో అదియు చెప్పబడెను. అనన్యచిత్తుడై పరమాత్మనే నిరంతరము చింతన జేయుచు లెస్సగ ధ్యానించుచు - ఈ ప్రకారముగ సర్వకాలములందును పరమాత్మతో గూడియుండవలెను.

'అనన్యాః' - అన్యములేనిది అనన్యము. అనగా భగవంతుడు తప్ప అన్యమగు ఏదియులేనివారని అర్థము. లేక పరమాత్మయందు తప్ప తక్కిన దేనియందును మనస్సును పోనీయకయుండువారని భావము. ఇంతకుమునుపు పైశ్లోకమందు స్వర్గభోగపరాయణులనుగూర్చి చెప్పబడినది. అట్టివారికిని, ఈ 'అనన్యభక్తు'లకును ఎంతయో భేదముకలదు. మొదటివారు దృశ్యమందు మనసును పోనిచ్చుచు ప్రాపంచిక విషయములందు కోరికలుగలవారైయుందురు. రెండవవారు భగవంతునిదప్ప అన్యమగు దేనియందును వాంఛలేనివారు. వారిదృష్టియందు దృశ్యపదార్థములన్నియు తుచ్ఛములుగ గానుపించును. లేక ఆత్మకంటె నన్యమగునదియంతయు మిథ్యగాదలంచి వానిపై కోరికలేక దృష్టినంతను ఆత్మయందే కేంద్రీకరించుదురు. కాబట్టి వారు 'అనన్యచిత్తు'లని చెప్పబడిరి. ప్రపంచములో జనులు మూడుతరగతులుగ నుందురు - కొందఱుభగవంతుని అసలు చింతింపకయేయుండి ప్రపంచదృష్టియే కలిగియుందురు. మఱికొందఱు దైవమును కొంతసేపు ధ్యానించి తదుపరి ప్రపంచదృష్టి కలిగియుందురు. ఇంక కొందఱు ప్రపంచదృష్టియేలేక నిరంతరము దైవచింతన, స్మరణ, ధ్యానాదులే కలిగియుందురు. ఈ మూడవతరగతివారే అనన్యచిత్తులు.

అట్టి నిరంతర దైవధ్యానపరులయొక్క యోగక్షేమములను కాపాడుపని తాను గైకొనెదనని భగవానుడు ప్రతిజ్ఞచేసిరి. ఆహా! భక్తులపై ఎట్టి వాత్సల్యము! ఎట్టి కరుణ! ఎట్టి అనుగ్రహబుద్ధి! మహాభక్తుడగు అర్జునునకు శ్రీకృష్ణుడు సారథిత్వమును వహించుట ఈ రహస్యమునే తెలుపుచున్నది. అర్జునుడు రథముయొక్క (గుఱ్ఱపు) పగ్గములను శ్రీకృష్ణునకొప్పగించెను. ఇక అతని రథమున కేలోటున్ను ఉండదు. అట్లే ఎవరు తమ 'జీవిత' పగ్గములను భగవానునిచేతికి అందించెదరో, వారి జీవితయాత్రకిక ఏలోటున్ను ఉండదు. ఎవరు తమ సమస్తమును భగవానునకు అర్పణచేసి అనన్య చిత్తులై ఆతనిని శరణుబొందెదరో, వారి జీవితరథము నాతడు నిరాటంకముగ నడుపగలడు. 'యోగక్షేమం వహామ్యహమ్' అను దానియర్థ మిదియే. భక్తునకేదేది అవసరమో అది ప్రపంచవస్తువుగాని, ఆత్మజ్ఞానముగాని దానినిచేర్చుట, అట్లు చేర్చినదానిని సంరక్షించుట - ఈ రెండుపనులను భగవానుడు భక్తునకు చేసిపెట్టును. అయితే ఆ భక్తుడు అనన్య చింతనతో భగవానుని ధ్యానించువాడైయుండవలెను. కొంతభక్తి దృశ్యవిషయములందు, కొంతభక్తి దేవునియందు పంచియుండుట అనన్యభక్తి కానేరదు.

భగవానుని ఈ 'అభయ' వాక్యముద్వారా భక్తుల కొక బరువు తీరిపోయినది. ఏలయనిన, కొందఱు "మేము నిరంతరము భగవంతుని ధ్యానించుచుండినచో మా సంసారము చూచువారెవరు ? వారికి సంపాదించి పెట్టువారెవరు ?" అని ప్రశ్నించుచుందురు. అట్టివారిని భగవానుడీ శ్లోకముద్వారా చక్కగ సంతృప్తిపఱచెను.

'అనన్యభక్తుడు' కావలెనేగాని ఇక 'వాని బాగోగులను నేనే చూచుకొందును' అని భగవానుడు సెలవిచ్చిరి. అట్టివాడు ఏ కొండగుహయందున్నను, అరణ్యమధ్యమందున్నను, వానిని భగవానుడు అనుసరించియేయుండి వాని యోగక్షేమములను విచారించుచుండును. కావున తీవ్రముముక్షువులు ఇక ఏ దిగులులేక సమస్తము భగవంతున కర్పించి వారినే ఎల్లవేళలందును స్మరించుచు ధ్యానించుచుండవచ్చును. మహాభక్తులయొక్క చరిత్ర లొక్కసారి పరికించినచో ఈ శ్లోకమందలి సత్య మెట్లు కార్యాన్వితమైనది తెలియగలదు. వారెచటికిపోయినను ఒకకంట సర్వేశ్వరుడు వారిని కనిపెట్టుచునే యుండును.

ఇచట 'యే జనాః' (ఏ జనులు) అని చెప్పినందువలన ఎవ్వరైననుసరియే జాతి మత కులభేదము లేక

భగవత్కృపకు పాత్రులుకాగలరని స్పష్టమగుచున్నది. అయితే అర్హత కలిగియుండవలెను. అనన్యభక్తియే ఆ అర్హత. ఆంజనేయుడు మృగజాతిలో జనించియు అనన్యభక్తిచే భగవదనుగ్రహమునకు పాత్రుడు కాగలిగినపుడిక మానవుల విషయమై వేఱుగ చెప్పవలెనా? అనన్యభక్తియను మూల్యము చెల్లించినచో భగవత్కృప యను వస్తువు తద్ద్వారా యోగక్షేమప్రాప్తి లభించును. ఈ శ్లోకమందు చెల్లించవలసిన మూల్యమును, లభ్యమగువస్తువు రెండును తెలుపబడినవి. మూల్యము చెల్లించనిదే సామాన్యమగు ప్రపంచవస్తువే లభించకయుండ ఇక పరమార్థవస్తువు విషయమై వేఱుగ చెప్పవలయునా! కాబట్టి భగవదనుగ్రహమును ఈ జీవితమునందే బడసి తరించుటకుగాను, ప్రతివారును అనన్యదైవచింతనను లెస్సగ నభ్యసించవలెను.

'పర్యుపాసతే' - 'ఉపాసతే' అని చెప్పక 'పర్యుపాసతే' అని చెప్పుటవలన భగవానుని లెస్సగ, ఎడతెగక ధ్యానించవలెనని తెలిపినట్లైనది.

'యోగక్షేమమ్' - అనుచోట యోగమనుదానిలో భక్తులకు వలసిన జీవితావసరవస్తువులేకాక, ఆత్మజ్ఞానముకూడ చేరియున్నది. నిరంతర భగవచ్చింతనచే సర్వేశ్వరుడు సంతుష్టుడై ఆత్మజ్ఞానమును కలుగజేసి అది జారిపోకుండ సంరక్షించుచుండును. (దదామి బుద్ధియోగం).

'నిత్యాభియుక్తానామ్' - అని చెప్పినందువలన ఏ కొద్దిసేపో ధ్యానించువారు కాదనియు, నిరంతర ధ్యానశీలురనియు అర్థము.

ప్ర:- భగవంతుని ఏ ప్రకారముగ చింతన చేయవలెను?

ఉ:- అనన్యచిత్తముతో - ఒక పరమాత్మతప్ప ఇతరమెద్దియు మనస్సునకు రాకయుండవలెను. మఱియు ఇతరమగు దేనియందును కోరికలేక యుండవలెను.

ప్ర:- అట్లు అనన్యచిత్తులై ధ్యానించువారికి కలుగు ఫలితమేమి?

ఉ:- భగవత్కృపయే. అట్టివారి యోగక్షేమములను భగవానుడు వహించుచుండును.

ప్ర:- కావున భగవత్కృప లభించుటకై జీవు డేమి చేయవలెను?

ఉ:- అనన్యచిత్తముతో పరమాత్మను నిరంతరము ధ్యానించుచుండవలెను.

అ|| శ్రద్ధతో ఇతరదేవతలను అర్చించువారు (క్రమపద్ధతితప్పి) తన్నే అర్చించువారగుదురని భగవానుడు తెలుపుచున్నాడు.

23. యేఽప్యన్యదేవతాభక్తా యజన్తే శ్రద్ధయాన్వితాః
తేఽపి మామేవ కౌన్తేయ యజన్త్యవిధిపూర్వకమ్.

టీక: కౌన్తేయ = ఓ అర్జునా!, యే అపి = ఎవరైతే, అన్యదేవతాభక్తా = ఇతరదేవతలయెడల భక్తిగలవారై, శ్రద్ధయాన్వితాః = శ్రద్ధతోగూడినవారలై, యజన్తే = (ఆ దేవతలను) ఆరాధించుచున్నారో, తే అపి = వారుకూడ, మామ్ ఏవ = నన్నే, అవిధిపూర్వకమ్ = విధితప్పి (క్రమముతప్పి), యజన్తి = ఆరాధించుచున్నారు.

తా:– ఓ అర్జునా ! ఎవరు ఇతర దేవతలయెడల భక్తిగలవారై శ్రద్ధతోగూడి వారి నారాధించుచున్నారో, వారున్ను నన్నే అవిధిపూర్వకముగ (క్రమముతప్పి) ఆరాధించుచున్న వారగుదురు.

వ్యాఖ్య:– కొందఱు నిరాకార నిర్గుణపరమాత్మనుగాక, నామరూపసహితులగు ఇతర దేవతలను ఆరాధించుచుందురు. వారుగనుక శ్రద్ధతో ఆ యారాధనమును సల్పినచో, ఒకదృష్టితో వారు ఆయా దేవతలకు అధిష్ఠానరూపుడైవర్తించు పరమాత్మను కొలిచిన వారేయగుదురు. అయితే ఇది సక్రమ భగవదర్చనముకాదు. విధిపూర్వక పరమాత్మ సేవనము కాదు. క్రమపద్ధతి తప్పిన భగవదారాధనమేయగును. ఏలయనిన వారు సర్వవ్యాపక పరమాత్మను సాక్షాత్తుగ సేవించుటలేదు. కాబట్టి పుణ్యఫలములందును తారతమ్యముండును. ఇతరదేవతలను అర్చించినచో ఒకింత పుణ్యము లభించును. సర్వవ్యాపక, సర్వాధిష్ఠాన పరమాత్మను సేవించినచో సాక్షాన్మోక్షమే చేకూరును. అయితే ఏ దేవతను ఆరాధించినను, కేవలము పరమాత్మను ఆరాధించినను శ్రద్ధమాత్రము తప్పక యుండవలెను. మఱియు ఇతరదేవతల నారాధించి అల్పఫలములను పొందుటకంటె సాక్షాత్ పరమాత్మనే సేవించి మోక్షరూప మహోన్నత ఫలమును బడయుట శ్రేయస్కరము.

ప్ర:– భగవదారాధన యెట్లు జరుపవలెను ?

ఉ:– శ్రద్ధతోగూడి.

అ॥ ఇతర దేవతాభక్తులు మోక్షపదము (దైవసాక్షాత్కారము) నెందులకు బొందజాలకున్నారో తెలియజేయుచున్నాడు –

24. అహం హి సర్వయజ్ఞానాం భోక్తా చ ప్రభురేవ చ
న తు మామభిజానన్తి తత్త్వేనాతశ్చ్యవన్తి తే.

టీక:– హి = ఏలయనగా, సర్వయజ్ఞానామ్ = సమస్తయజ్ఞములకు, భోక్తా చ = భోక్తయు, ప్రభుఃఏవ చ = ప్రభువు (యజమానుడు)ను, అహమ్ ఏవ = నేనే (అయియున్నాను), మామ్ = (అట్టి) నన్ను, తే = వారు, తత్త్వేన = యథార్థముగ, న అభిజానన్తి = తెలిసికొనుటలేదు, అతః = ఇందువలన, చ్యవన్తి = జారిపోవుచున్నారు (పునర్జన్మను పొందుచున్నారు).

తా:– ఏలయనగా, సమస్తయజ్ఞములకు భోక్తను, ప్రభువు (యజమానుడు)ను నేనే అయియున్నాను. అట్టి నన్ను వారు యథార్థముగ తెలిసికొనుటలేదు. ఇందువలన జారిపోవుచున్నారు. (పునర్జన్మను బొందుచున్నారు).

వ్యాఖ్య:– సమస్తయజ్ఞములకు పరమాత్మయే భోక్త; ప్రభువు. ఇట్టి యథార్థజ్ఞానము లేనందువలన సంకుచితదృష్టిగలవారై, ఆ యా దేవతల నుద్దేశించియే క్రియలను జరుపుచు ఉన్నతస్థానమునుండి దిగజారిపోయి సంసారకూపమున జననమరణప్రవాహమున పడిపోవుచున్నారు. పరమాత్మను ధ్యానించి పరమాత్మను బొందువారు తప్ప తక్కిన వారందఱు పునరావృత్తి గలిగియే యుందురు. పరమాత్మను గూర్చిన యథార్థజ్ఞానము లేనివారందఱు పునరావృత్తి గలిగియే యుందురు. పరమాత్మను గూర్చిన యథార్థజ్ఞానము లేనివారందఱును ఈప్రకారముగ జననమరణములకు గురియగుచునేయుందురు. ఇదియే చ్యుతి;

సంసారమను గోతియందు దిగజారుట. కావున పరమాత్మనుగూర్చి బాగుగ తెలిసికొనవలెను. 'తత్త్వేన' అని చెప్పుటచే సామాన్యజ్ఞానము చాలదనియు యథార్థముగ, ప్రత్యక్షముగ తెలిసికొనవలెననియు భావము. అనగా భగవానుడు సర్వాంతర్యామియై సమస్త చరాచరములకు అధిష్ఠానమై, జీవులనిజరూపమై వెలయుచుండుటను అనుభవపూర్వకముగ తెలిసికొనవలెను. అట్టివారిక జారరు. వారికి చ్యుతి సంభవింపదు. వారు పరమాత్మయొక్క యథార్థజ్ఞానము కలవారై అతిజాగరూకులై, స్వస్వరూపాత్మయందే నిష్ఠగలిగి మిథ్యయగు దృశ్యమును గూర్చిన భావన లేక యుందురు.

ప్ర:– సమస్తయజ్ఞములకు భోక్తయెవరు ? ప్రభువెవరు ?

ఉ:– పరమాత్మయే.

ప్ర:– జను లేల సంసారమను గోతిలోనికి జారిపోవుచున్నారు ?

ఉ:– భగవంతునిగూర్చిన యథార్థజ్ఞానము లేనందుచే.

ప్ర:– కాబట్టి 'సంసారచ్యుతి' నుండి తప్పించుకొనుట కుపాయమేమి ?

ఉ:– పరమాత్మనుగూర్చిన యథార్థజ్ఞానము గలిగియుండుటయే. (అనగా పరమాత్మయే సమస్త దేవతలకు, సమస్త చరాచర ప్రపంచమునకు అధిష్ఠానరూపుడనియు, త్రికాలాబాధ్యుడనియు, సత్యస్వరూపుడనియు ఎఱుంగుట).

అ॥ ఏ యే దేవతల నారాధించువా రాయాదేవతలనే పొందుదురనియు, తన్నారాధించువారు తన్నే పొందుదురనియు భగవానుడు చెప్పుచున్నాడు -

25. యాన్తి దేవవ్రతా దేవాన్ పితౄన్ యాన్తి పితృవ్రతాః
భూతాని యాన్తి భూతేజ్యా యాన్తి మద్యాజినోఽపి మామ్.

టీక:– దేవవ్రతాః = దేవతలనారాధించువారు, దేవాన్ = దేవతలను, యాన్తి = పొందుచున్నారు, భూతేజ్యా = భూతములను పూజించువారు, భూతాని = భూతములను, యాన్తి = పొందుచున్నారు, మద్యాజినఃఅపి = నన్నుపూజించువారో (ధ్యానించువారో), మామ్ = నన్నే, యాన్తి = పొందుచున్నారు.

తా:– దేవతల నారాధించువారు దేవతలను, పితృదేవతల నారాధించువారు పితృదేవతలను, భూతముల నారాధించువారు భూతములను, నన్నారాధించువారు నన్ను పొందుచున్నారు.

వ్యాఖ్య:– మనస్సు ఎట్టిభావనలతో గూడియుండునో అట్టి రూపమునే పొందుచుండును. కాబట్టి జను లేయే దేవతలను అర్చించుచుందురో వారివారినే పొందుచుందురు. అశాశ్వత దేవతలను పూజించువారు వారినే బొందుదురు. శాశ్వత పరమాత్మను ధ్యానించువారు అట్టి శాశ్వతస్వరూపమునే చేరుదురు. కావున వారువారు ధ్యానించు, పూజించు లక్ష్యస్వరూపము శాశ్వతమా, అశాశ్వతమా యని విజ్ఞులు ముందుగా యోచనచేయవలెను. పరమాత్మతప్ప తక్కిన వ్యక్తులుగాని, లోకములుగాని ఏదియో యొక కాలమున నశించిపోవువారే. దేవతలుగాని, భూతములుగాని, సర్వులును ఉపాధిని ధరించినవారే కనుక, ఆ యుపాధి యేనాటికైనను విలయమొందిపోవుటచే శాశ్వతమగు స్థితిని వారు పొందజాలకయే యుందురు. పరమాత్మ

అట్లుకాడు. అతడు అవినాశి, అవ్యయుడు, సనాతనుడు; దేశకాలములకు వశముకానివాడు. అట్టివానిని అర్చించువారు, ధ్యానించువారు నాశరహితమగు పరమాత్మపదమునే పొందుదురు. కాబట్టి ఇదియే సర్వశ్రేష్ఠమగు లక్ష్యము, గమ్యము. విజ్ఞులగువారు అశాశ్వత వస్తువును వాంఛింపరు. శాశ్వతమునే కోరుదురు. కావున పునరావృత్తిరహిత శాశ్వతపదవి నొసంగు పరమాత్మనే జనులాశ్రయింపవలెను. అతనినే ధ్యానింపవలెను. ఏ వ్రతములను, నియమములను, నిష్ఠలను ఇతర దేవతల నారాధించుటయందుపయోగించుచున్నారో, వానిని పరమాత్మ నుపాసించుటయందు వినియోగించవలెను, 'దేవతావ్రతులు' 'ఆత్మవ్రతులుగ 'గ మారవలెను.

ప్ర:– దేవతలనుగాని, పితృదేవతలనుగాని, భూతములనుగాని ఆరాధించువా రెవరిని పొందుదురు?

ఉ:– వారువా రుపాసించు ఆ యా దేవతలనే పొందుదురు.

ప్ర:– పరమాత్మను ఆరాధించువారో ?

ఉ:– పరమాత్మనే పొందుదురు.

అ॥ భక్తితో ఏస్వల్పవస్తువు నొసంగినప్పటికిని తాను సంతుష్టినొందెదనని భగవానుడు పలుకుచున్నాడు

26. పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి
తదహం భక్త్యుపహృతమశ్నామి ప్రయతాత్మనః.

టీక:– యః = ఎవడు, మే = నాకు, భక్త్యా = భక్తితో, పత్రమ్ = ఆకు(దళము) ను గాని, పుష్పమ్ = పువ్వునుగాని, ఫలమ్ = పండునుగాని, తోయమ్ = జలమునుగాని, ప్రయచ్ఛతి = ఇచ్చుచున్నాడో, ప్రయతాత్మనః = (అట్టి) పరిశుద్ధాంతఃకరణునియొక్క (లేక, పరమార్థయత్నశీలునియొక్క), భక్త్యుపహృతమ్ = భక్తిపూర్వకముగ సమర్పింపబడిన, తత్ = ఆ పత్రపుష్పాదులను, అహమ్ = నేను, అశ్నామి = (ప్రీతితో) ఆరగించుచున్నాను (అనుభవించుచున్నాను).

తా:– ఎవడు నాకు భక్తితో ఆకునుగాని, పువ్వునుగాని, పండునుగాని, జలమునుగాని సమర్పించుచున్నాడో అట్టి పరిశుద్ధాంతఃకరణునియొక్క (లేక, పరమార్థయత్నశీలునియొక్క) భక్తిపూర్వకముగ నొసంగబడిన ఆ పత్రపుష్పాదులను నేను (ప్రీతితో) ఆరగించుచున్నాను (అనుభవించుచున్నాను).

వ్యాఖ్య:– పైనదెల్పిన పత్రపుష్పాదులు బీదలకు, ధనవంతులకు, పండితులకు, పామరులకు, సర్వులకును అందుబాటులోనున్న వస్తువులు. భగవత్ప్రీతిని బడయుటకు సామాన్యమైన వస్తువునైనను ప్రీతితో, భక్తితో సమర్పించిన చాలునని ఈశ్లోకముద్వారా వెల్లడియగుచున్నది. శక్తిలేనివారు మేము పెద్ద పెద్ద నైవేద్యములను దేవునకు సమర్పింపలేకపోతిమేయని దిగులునొందరాదు. ఏలయనిన భగవానుడు భక్తిని, హృదయశుద్ధిని ప్రధానముగ నెంచునేకాని వస్తువునుగాదు. వాస్తవముగచూచిన దేవునకు ఒకానొక వస్తువు యొక్క ఆవశ్యకత యేమియునులేదు. బ్రహ్మాండములన్నియు వారి కుక్షియందే యుండ ఇక వారికేమి కొఱత ? అయినను నిర్మలమనస్కులగు భగవానుడు రెండుషరతులను నియమించిరి. అవియేవి యనిన–

(1) ఇచ్చువాడు పరిశుద్ధుడై యుండవలెను.

(2) ఇచ్చుదానిని పరమభక్తితో నీయవలెను.

మలినచిత్తము గలవాడు ఏదియొసంగినను, తుదకు రాజ్యాదులను, మేరుపర్వతమంత బంగారమిచ్చినను భగవంతుడు స్వీకరింపరు. శుద్ధచిత్తముగలవాడు, నిర్మలాంతఃకరణుడు కేవలమొక ఆకు ఇచ్చినను, పువ్వు ఇచ్చినను, పండు ఇచ్చినను, గరిటెడు నీరిచ్చినను మహాసంతుష్టితో గ్రహించును. అట్లే భక్తిలేకుండ రత్నరాసులిచ్చినను స్వీకరింపరు. భక్తితో చిల్లిగవ్వ ఇచ్చినను ఆనందముతో తీసికొనును. ప్రేమగాని, భక్తిగానిలేని దుర్యోధనునియింట అతిథ్యమును నిరాకరించి, దయ, ప్రేమ, ఉట్టిపడుచుండు విదురునియింట శ్రీకృష్ణమూర్తి అతిథ్యమును స్వీకరించుట సర్వులకును విదితమే కదా! మఱియు కుచేలుని అటుకులను పరమప్రీతితో వారు గైకొనినసంగతియు అందఱికిని తెలిసినదే కదా!

దీనినిబట్టి భగవంతుని యనుగ్రహము మనుజుడిచ్చు వస్తువుయొక్క గొప్పతనముపైగాని, విలువపైగాని ఆధారపడియుండదనియు, అతనియొక్క మనస్తత్త్వముపైననే ఆధారపడియుండుననియు స్పష్టమగుచున్నది. అతని నిర్మలభక్తి, నిర్మలహృదయము - వీనిపైగాని ఆధారపడియుండదనియు, అతనియొక్క మనస్తత్త్వముపైననే ఆధారపడియుండుననియు స్పష్టమగుచున్నది. అతని నిర్మలభక్తి, నిర్మలహృదయము - వీనిపైననే సర్వేశ్వరునికృప ఆధారపడియుండును. కనుకనే ఎంతటి కోటీశ్వరులైనను, రాజాధిరాజులైనను, మహాపండితులైనను, భగవంతుని అనుగ్రహమును కొందఱు పొందలేకుండుటయు, వారి దయకు పాత్రులు కాకుండుటయు చిల్లిగవ్వయైనలేక, కౌపీనధారులైయుండువారు పరమాత్మయొక్క అపారకృపకు పాత్రులగుటయు చరిత్రయందుకానంబడుచున్నది. భక్తి, చిత్తశుద్ధి - అను నీరెండే భగద్దృష్టిలో ప్రధానములుకాని, తక్కినవికావు. 'అశ్నామి' అని చెప్పుటవలన అట్టి భక్తితో నీయబడిన దానిని పరమాత్మ గ్రహించుటయేకాదు, అనుభవించునని, భుజించునని, స్పష్టమగుచున్నది. ఆహా! భక్తులపై భగవానున కెంతటి కరుణయో చూడుడు!

'ప్రయతాత్మనః' - అను పదమునకు నిర్మలాంతఃకరణుడని, ప్రయత్నశీలుడనియు అర్థములు కలవు.

'యః' అని ప్రయోగించుటవలన ఎవరైనను సరియే - జాతిమతకులవిచక్షణగాని, ధనిక దరిద్ర భేదముగాని, స్త్రీపురుష భేదముగాని లేక - భక్తితోగూడి నిర్మలచిత్తుడై యుండినచో అతడొసంగినది సర్వేశ్వరుడు స్వీకరించునని తేలుచున్నది.

భక్తి యనునది, హృదయశుద్ధి యనునది మోక్షప్రయాణమునకు టికెట్టు వంటిది. టిక్కెట్టు చేతగలవారు ఎంతబీదవారైనను, అల్పకులస్థులైనను రైలుపెట్టెలో నిశ్చింతగ, నిర్భయముగ ప్రయాణముచేసి గమ్యస్థానమును చేరగలరు. అట్లుకాక, టిక్కెట్టులేనివారు ఎంత ధనవంతులైనను, అధికారవంతులైనను, పండితులైనను, సౌందర్యవంతులైనను వారిని రైలుపెట్టెలోనుండి దింపివేయుదురు. వారు గమ్యస్థానమును చేరజాలరు. అట్లే మోక్షప్రయాణమున్ను. కాబట్టి భగవత్కృపకు, మోక్షప్రాప్తికి భక్తి, చిత్తనైర్మల్యము అతి ప్రధానములైయున్నవి. ఈవిషయమును భగవాను డీశ్లోకముద్వారా సుస్పష్టము చేసియున్నారు. ముక్తికి అర్హత, యోగ్యత (MERIT) ప్రధానమేకాని తక్కిన విషయములుకావని ఇట ఋజువుచేయబడినది. ఇట్టి బోధలవలన ప్రపంచములో ప్రతి మానవుడును దైవమార్గమున ప్రయత్నించుటకు అవకాశమేర్పడుచున్నది. దేవునిబిడ్డలని ముద్రవేయబడినవా రెక్కడను ఉండరు.

అనన్యభక్తిగలవారే, నిర్మలచిత్తముగలవారే దేవుని బిడ్డలు. అట్టివారినే యతడు **కరుణించును** వారికే ఆత్మజ్ఞానమును ప్రసాదించును.

'యమేవైషవృణుతే తేన లభ్య స్తస్యైష ఆత్మా వివృణుతే తనూం స్వామ్.'

అను ఉపనిషద్వాక్య మీసత్యమునే తెలుపుచున్నది.

భగవంతునకు	పత్రమును	-	విదురుడు, ద్రౌపది	భక్తితో ఒసంగి కృతార్థులైరి.
	పుష్పమును	-	గజేంద్రుడు	
	ఫలమును	-	శబరి	
	తోయమును	-	రంతీదేవుడు	

ప్ర:— భగవంతుడు దేనిని స్వీకరించును ?

ఉ:— భక్తితోను, నిర్మలచిత్తముతోనుగూడిన ఏ స్వల్పవస్తువు (పత్రముగాని, పుష్పముగాని, ఫలముగాని, జలముగాని) నొసంగినను ప్రీతితో స్వీకరించును.

ప్ర:— కాబట్టి భగవత్కృపను సంపాదించవలెననిన ఏది అవశ్యకము?

ఉ:— (1) భక్తి, (2) చిత్తశుద్ధి - అను రెండును ఆవశ్యకములు.

అ॥ ఏ కార్యమును చేసినను భగవదర్పణముగ చేయవలయునని ఉద్బోధించుచున్నాడు-

27. యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్ యత్తపస్యసి కౌన్తేయ తత్కురుష్వ మదర్పణమ్.

టీక:— కౌన్తేయ = ఓ అర్జునా !, యత్ = దేనిని, కరోషి = చేయుచున్నావో, యత్ = దేనిని, అశ్నాసి = తినుచున్నావో, యత్ = దేనిని, దదాసి = దానము చేయుచున్నావో, యత్తపస్యసి = ఏ తపస్సును జేయుచున్నావో, తత్ = దానిని, మదర్పణమ్ = నాకర్పణము, కురుష్వ = చేయుము.

తా:— ఓ అర్జునా! నీవేదిచేసినను, తినినను, హోమమొనర్చినను, దానముచేసినను, తపస్సుచేసినను, దానిని నా కర్పింపుము.

వ్యాఖ్య:— మనుజుడు తాను చేయు సమస్తకార్యములను ఈశ్వరార్పణబుద్ధితో గావింపవలెను. ఫలితములను గోరక కార్యములను భగవదర్పితము చేయవలెను. అట్లు చేయుటవలన గలుగు ఫలితము రాబోవు శ్లోకమున వివరింపబడినది. అట్టివాడు ఆ యా కర్మబంధనములనుండి విడువబడి పరమాత్మనే బొందుచున్నాడు. అతని హృదయము మాలిన్యరహితముకాగా పరబ్రహ్మమును సాక్షాత్కరించుకొనుచున్నాడు. కాబట్టి ఈ ప్రకారముగ సమస్తకర్మలను భగవదర్పితముచేయుట మోక్షప్రాప్తికి, ఆత్మసాక్షాత్కారమునకు సులభోపాయముగ నుండుచున్నది. 'ఏదిచేసినను' అని చెప్పుటచే 'పాపకార్యమును' చేసినను అని అర్థముకాదు. ఏలయనిన, పాపకార్యములను భగవంతునకెవరును సమర్పింపరు గదా! అట్లే 'ఏమితినినను' అనుచోట నిషిద్ధాహారమును అన్వయించుకొనగూడదు.

కర్మచేయక ఏజీవియు నుండలేదు. ఉదయము లేచినదిమొదలు రాత్రి పరుండు వఱకును పెక్కుకార్యములను జీవుడు చేయుచుండును. ఎటుతిరిగి వానిని తప్పకచేయవలసియున్నది, కావున 'కృష్ణార్పణమస్తు' 'బ్రహ్మార్పణమస్తు' అని వానినేల చేయరాదు ? అట్లు చేయుటవలన భగవదనుగ్రహము సిద్ధించుటయు, కర్మబంధము తొలగుటయు రెండును సిద్ధించును. కావున మోక్షమునకిది సర్వులకును సులభోపాయముగనున్నది. ముఖ్యముగ పనిపాటలు చేసికొను గృహస్థున కీపద్ధతి యెంతయో సులువుగనుండగలదు.

'యద్యత్కర్మకరోమి తత్తదఖిలం శంభో తవారాధనమ్' - 'ఓ పరమశివా! నేను (నడచినను, కూర్చొనినను, భుజించినను) ఏదిచేసినను అదియంతయు నీ యారాధనమే' అని ఒక భక్తుడు భగవంతునిగూర్చి పలికిన పలుకు లీ సందర్భమున స్మరణీయములైయున్నవి.

ప్ర:— జీవు డేప్రకారము కర్మల నాచరించవలెను?

ఉ:— తానేదిచేసినను, భుజించినను, హోమముచేసినను, దానమొనర్చినను, తపస్సుచేసినను అంతయు భగవదర్పణముగ చేయవలెను. ఈశ్వరార్పణబుద్ధితో కర్మల నాచరింపవలెనని భావము.

ప్ర:— అట్లు చేయుటవలన కలుగు ఫలితమేమి?

ఉ:— కర్మబంధవిముక్తి, భగవత్ప్రాప్తి.

అ॥ అట్లు సమస్తకర్మలను భగవదర్పణము చేయుటవలన కలుగు ఫలితమేమియో వచించుచున్నాడు -

28. శుభాశుభఫలై రేవం మోక్ష్యసే కర్మబన్ధనైః
సన్న్యాసయోగయుక్తాత్మా విముక్తో మాముపైష్యసి.

టీక:— ఏవమ్ = ఈప్రకారముగ, సన్న్యాసయోగయుక్తాత్మా = 'కర్మసమర్పణ' యోగముతో గూడినవాడవై, శుభాశుభఫలైః = ఇష్టానిష్టములు (లేక పుణ్యపాపములు) ఫలములుగాగల, కర్మబన్ధనైః = కర్మబంధములనుండి, మోక్ష్యసే = విడువబడగలవు, విముక్తః = (అట్లు) విడువబడినవాడవై, మామ్ = నన్ను, ఉపైష్యసి = పొందగలవు.

తా:— ఈ ప్రకారముగ 'కర్మసమర్పణ' యోగముతో గూడినవాడవై పుణ్యపాపములు ఫలములుగాగల కర్మబంధములనుండి నీవు విడువబడగలవు. అట్లు విడువబడినవాడవై నన్ను పొందగలవు.

వ్యాఖ్య:— క్రిందటి శ్లోకమున జెప్పబడిన సర్వకర్మఫలత్యాగమునకును, భగవదర్పిత కర్మకు ఫలమిచట చెప్పబడుచున్నది. 'సన్న్యాస' మనగా కర్మఫలసన్న్యాస మని అర్థము. 'కర్మలనుజేయుచు వానిని నాకర్పణచేయుము' అని భగవానుడు చెప్పినందువలన సన్న్యాసమున కిచట ఫలత్యాగమే అర్థమగునుగాని కర్మత్యాగముకాదు. ఈ ప్రకారముగ సమస్తకర్మఫలములను భగవదర్పణముచేయుటవలన జీవుడు శుభాశుభఫలరూప కర్మబంధములనుండి విముక్తుడై పరమాత్మను బొందగలడని యిట వచింపబడినది. 'ముక్తుడై' అని చెప్పక 'విముక్తుడై' అని చెప్పుటవలన అట్టివాడు కర్మబంధమునుండి పూర్తిగ విడివడునని అర్థమగుచున్నది.

సామాన్యముగ జనులు 'మోక్షము' 'మోక్షము' అని పలుకుచుందురు. ఆ మోక్షమునకు అర్థమేమి? బంధవిమోచనమే మోక్షము. ఏమిబంధము? కర్మబంధము. ఏమికర్మలు? శుభాశుభ ఫలముల నొసంగు కర్మలు. అట్టి కర్మరూప బంధనమునుండి విడుదలయే మోక్షము. అయ్యది 'సన్న్యాస'యోగముచే అనగా కర్మఫలములను ఈశ్వరార్పణమొనర్చుటద్వారా లభించుచున్నది. దీనినే నిష్కామకర్మయోగమనియు నందురు. అయితే శుభాశుభఫలములు రెండును ఇచట బంధనములుగా వర్ణింపబడుట గమనింపదగినది. అశుభకర్మ, అశుభఫలము బంధమని అందఱికిని తెలిసినవిషయమే. అయితే అతీత పరమార్థదృష్టియందు దృశ్యముగాని, తదంతర్గతమగు ఏకర్మగాని, ఏ ఫలముగాని మిథ్యయే యగుటచే శుభకర్మయు, శుభఫలమున్ను దానియందే అంతర్గతమగుటబట్టి అదియు బంధమని ఇచట తెలుపబడినది కావున దానినికూడ దాటి సత్యవస్తువగు పరమాత్మను జేరవలయునని తాత్పర్యము. (అయితే శుభకర్మరూపబంధము ముముక్షువునకు ప్రమాదకరమైనదికాదు. మొదట దాని నాశ్రయించి, క్రమముగ దానిని దాటి నిర్వికల్పాత్మస్థితికి బోవచ్చును). ఈ ప్రకారముగ కర్మలను తత్ఫలములను ఈశ్వరార్పణమొనర్చుటవలన ఆ కర్మసంబంధమైన బంధనములనుండి జీవుడు విముక్తుడై పరమాత్మను జేరుచున్నాడు. ఫలాభిసంధిరహితముగ కర్మల నాచరించుటవలనను, లేక, కర్మలను భగవదర్పణముగావించుటవలనను ఆ కర్మలందలి దోషము - నివృత్తమగుచున్నది. అందుచే జీవుడు కర్మబంధవిముక్తుడై భగవత్సాయుజ్యమును బడయుచున్నాడు.

ప్ర:- కర్మబంధన మెట్టిది?

ఉ:- శుభాశుభ ఫలరూపమైనది.

ప్ర:- అట్టి కర్మబంధనమునుండి జీవుడెట్లు విముక్తుడు కాగలడు ?

ఉ:- తానాచరించు సమస్తకర్మములను ఈశ్వరార్పణము చేయుటవలన. దానిచే కర్మబంధ విముక్తి పరమాత్మపదప్రాప్తి - అను రెండుసత్ఫలితము లాతనికి చేకూరుచున్నవి.

అ॥ సర్వజీవులందును తనకు సమభావమే కలదనియు, వారివారి భక్తినిబట్టి వారు తరించిపోవుదురనియు భగవానుడు వచించుచున్నాడు -

29. సమోఽహం సర్వభూతేషు న మే ద్వేష్యోఽస్తి న ప్రియః
యే భజన్తి తు మాం భక్త్యా మయి తే తేషు చాప్యహమ్.

టీక:- అహమ్ = నేను, సర్వభూతేషు = సమస్తప్రాణులందును, సమః = సమముగానుండువాడను, మే = నాకు, ద్వేష్యః = ద్వేషింపగదినవాడు, న అస్తి = లేడు, ప్రియః = ఇష్టుడును, న = లేడు, యేతు = ఎవరైతే, మామ్ = నన్ను, భక్త్యా = భక్తితో, భజన్తి = సేవించుచున్నారో, తే = వారు, మయి = నాయందు, (వర్తన్తే = ఉన్నారు) తేషుచ = వారియందును, అహమ్అపి = నేనును, (వర్తే = ఉన్నాను).

తా:- నేను సమస్తప్రాణులందును సమముగా నుండువాడను. నాకొకడు ద్వేషింపదగినవాడుగాని, మఱియొకడు ఇష్టుడుగాని ఎవడును లేడు. ఎవరు నన్ను భక్తితో సేవించుదురో వారు నాయందును, నేను వారియందును ఉందుము.

వ్యాఖ్య:– సమస్త చరాచర ప్రాణికోట్లయందును భగవంతుడు సమానముగా నున్నారు. వారిదృష్టియందు అందఱున్ను సమమే. వారికి ఒకడు ప్రియుడు, మఱియొకడు అప్రియుడు ఉండనేరడు. అందఱును వారి బిడ్డలే. అందఱియందును వారికి సమానవాత్సల్యమే కలదు. అయితే లోకములో కొందఱు సుఖవంతులుగను, మఱికొందఱు దుఃఖవంతులుగను ఉండుటకు కారణమేమి? భగవంతునకు పక్షపాతము కలదా? అని ప్రశ్నించవచ్చును. భగవానున కెవరిపైనను పక్షపాతములేదు. కాని జీవులు వారువారు చేసికొనిన కర్మననుసరించి ఆ యా సుఖదుఃఖాది ఫలములనొందుచున్నారు. దేవుడందఱియందును సమముగనున్నను, దేవునియం దందఱును సమముగలేరు. కొందఱు పుణ్యమును, మఱికొందరు పాపమును ఆచరించుట వలన తత్తత్ఫలితములగు సుఖదుఃఖముల నొందుచున్నారు. ఒకరికి మేలొనరించువారు, భగవంతుని భక్తితో నారాధించువారు, చిత్తశుద్ధికై ప్రయత్నము సలుపువారు సుఖమును బొందుదురు. పరులకు కీడొనర్చువారు, దేవుని భజించనివారు, మలినచిత్తులు దుఃఖమును బొందుదురు. ఇది ప్రకృతియందుగల అనుల్లంఘనీయమగు నియమము. దీనినిబట్టి జీవుల సుఖదుఃఖములందు భగవంతునకు ఏ బాధ్యతయులేదని స్పష్టమగుచున్నది. సూర్యప్రకాశము అంతట సమముగనున్నను మట్టిపై ప్రకాశింపక, అద్దమందు లెస్సగ ప్రకాశించును గదా. అట్లే భగవత్కరుణ సర్వత్ర వెలయుచున్నను ఎవరు భక్తితో భగవానుని సేవించుదురో వారే దానిని స్వీకరింపగల్గుదురు. సముద్రముపైగాలి అంతట వీచుచున్నను ఎవరు తెరచాప ఎత్తుదురో వారి పడవయే కదులునుగదా! కావున భగవత్కరుణ యను గాలి సర్వత్రవీచుచున్నను వారివారిహృదయములను తెరచాపలను విప్పి భగవదున్ముఖముగనుంచినచో మోక్షమను గమ్యస్థానమును శీఘ్రముగ చేరగలరు. అన్నిసుఖములకంటె గొప్పసుఖము భగవత్ప్రాప్తియే అయియున్నది. అదియో ఎవరు నిరంతరము అనన్యభక్తితో పరమాత్మను సేవింతురో, ఆరాధింతురో వారు పొందగలరు. ఆ విషయ మీశ్లోకమున స్పష్టముగ నిరూపింపబడినది. 'ఎవరు భక్తితో నన్నారాధింతురో వారు నాయందును, నేను వారియందును ఉందుము' అని భగవాను డిచటసెలవిచ్చిరి. ఆహా! భక్తియొక్క మహిమ యెట్టిదై యున్నది? దాని ఫలిత మెంత అపారమైయున్నది. సాక్షాత్ భగవత్ప్రాప్తియను మహోన్నతఫలము భక్తిపూర్వక భగవత్సేవనమను క్రియవలన లభించుచున్నది. కాబట్టి ప్రతిమానవుడును అట్టి పరమభక్తి నవలంబించి పరమాత్మను సేవించవలెను. 'భజన్తి' అనుపదమునకు 'భక్త్యా' అను పదము చేర్చుటవలన, సామాన్యమగు ఆరాధనము, సేవనము చాలదనియు భక్తితోగూడిన సేవన మావశ్యకమనియు స్పష్టమగుచున్నది. మఱియు 'మయి తే తేషుచాప్యహమ్' అని చెప్పుటవలన అట్టిభక్తులు భగవంతునియందును, భగవంతుడు అట్టి భక్తులందును కాపురముండునని తెలియు చున్నది. దేవుడువచ్చి కాపురముండుటబట్టి వారి శరీరోపాధి ఒక దేవమందిరముగ మారిపోవును. వారు దేవులుగా మారిపోవుదురు. అత్తఱి జీవుడు శివుడగును. దేహము దేవాలయమగును. ఎవరు దేవునియందు వసించుదురో వారియందు దేవుడు వసించును. కావున 'నాకు దుఃఖము కలుగుచున్నదే' అని విలపించిన ప్రయోజనములేదు.

దాని నివారణోపాయ మొకటియేకలదు. దేవుని తన హృదయమున కాహ్వానించుటయేయగును. ఎచట పరమాత్మయుండునో అచట సుఖము, ఐశ్వర్యము, విజయము తప్పక కలిగితీరును★. కాబట్టి సుఖమునపేక్షించువాడు అనన్యభక్తిని తప్పక ఆశ్రయించవలసియుండును.

ప్ర:– సర్వజీవుల యెడల భగవంతునిదృష్టి యెట్లుండును?

ఉ:– సమముగ నుండును.

★ యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థోధనుర్ధరః, తత్ర శ్రీర్విజయో భూతిర్ధ్రువా నీతిర్మతిర్మమ. (1878)

ప్ర:- అయితే జీవులలో కొందఱికి సుఖము, మఱికొందఱికి దుఃఖ మేల కలుగుచున్నది?

ఉ:- వారువారు చేయు కర్మలనుబట్టి అట్లు కలుగుచున్నది. ఎవరు భగవంతునియందుందురో (దేవుని సేవించెదరో) వారియందు భగవంతుడుండును. కావున అట్టివారికి సుఖముకలుగును. తక్కినవారికి కాదు.

ప్ర:- భగవంతుని ఏ ప్రకారముగ సేవించవలెను?

ఉ:- భక్తితో.

ప్ర:- భగవంతు డెవరియందు విశేషముగ నివసించును?

ఉ:- అనన్యభక్తితో ఆతనిని సేవించువారియందు నివసించును. (సామాన్యముగ అందఱి యందును 'సత్తాసామాన్య' రూపమున పరమాత్మ వ్యాపించియున్నను తన్ను సేవించువారియందు విశేషముగ నభివ్యక్తుడై వారికి మోక్షసుఖమును కలుగజేయునని భావము).

అ॥ పాపియైనను మనస్సుమార్చుకొని తన్ను భక్తితో సేవించినచో అతడు పుణ్యాత్ముడేయగునని భగవానుడు సెలవిచ్చుచున్నాడు -

30. అపి చేత్సుదురాచారో భజతే మామనన్యభాక్
సాధురేవ స మన్తవ్యస్సమ్యగ్వ్యవసితో హి సః.

టీక:- సుదురాచారః అపి = మిక్కిలిదురాచారముగలవాడైనప్పటికిని, అనన్యభాక్ = అనన్యభక్తితో (ఇతరమగుదేనియందును భక్తినుంచక, ఆశ్రయింపక), మామ్ = నన్ను, భజతేచేత్ = భజించునేని, సః = అతడు, సాధుః ఏవ = సత్పురుషుడనియే (లేక, శ్రేష్ఠుడనియే), మన్తవ్యః = తలంపబడదగినవాడు, హి = ఏలననగా, సః = అతడు, సమ్యక్ = స్థిరమైన (లేక ఉత్తమ), వ్యవసితః = మనోనిశ్చయముబొందియున్నాడు.

తా:- మిక్కిలి దురాచారముగలవాడైనప్పటికిని అనన్యభక్తిగలవాడై ఇతరమగు దేని యందును భక్తినుంచక, (ఆశ్రయింపక) నన్ను భజించునేని, అతడు సత్పురుషుడనియే (శ్రేష్ఠుడనియే) తలంపబడదగినవాడు. ఏలయనగా అతడు స్థిరమైన (ఉత్తమ) మనోనిశ్చయముగలవాడు.

వ్యాఖ్య:- మిక్కిలి దురాచారముగలవాడైనను, మనస్సుమార్చుకొని దైవమార్గమున వర్తించుచు పరమాత్మయే పరమగతియని నమ్మి, ఇతరమును దేనిని చింతింపక ఆ పరమాత్మనే సదా భజించుచో నతడు ఉత్తముడనియే చెప్పనగును. ఆతడు పూర్వము దురాచారి అయియున్నను ఇప్పుడు సాధువేయగును. 'దురాచారి' అని చెప్పక 'సుదురాచారి' అని చెప్పుటవలన మహాపాపి అయియున్నప్పటికిని మనస్సు మార్చుకొని భగవానుని లెస్సగ నాశ్రయించినచో అతడు మహాపుణ్యాత్ముడే యగునని భావము. ఎందుకనగా, అతడు సత్యమును గమనించెను. సరియైనమార్గమును జేబట్టెను. ఉత్తమనిశ్చయమునకు వచ్చెను. "ప్రపంచములో పరమాత్మ ఒకడే సత్యము. తక్కినదియంతయు అసత్యము, మిథ్య, నశ్వరము. కావున అసత్యమై, క్షణికమైనట్టి ఆత్మేతరవస్తువును అనగా దృశ్యపదార్థమును వదలి సత్యమై శాశ్వతమైన పరమాత్మనే ఆశ్రయింపవలెను." అనునది ఉత్తమనిశ్చయము (సమ్యక్ - వ్యవసితత్వము) అగును.

'అనన్యభాక్' - పరమాత్మతప్ప అన్యమగు దేనిని ఆశ్రయించనివాడు. నిరంతరము దైవమునుమాత్రము చింతించువాడు. అట్టి అనన్యభక్తుని పూర్వకాలికపాపమంతయు, పరమాత్మ సేవనముచే ఒక్కతృటిలో భస్మమైపోవ అతడు వినిర్మలహృదయుడగును. అనేక వేల సంవత్సరములనుండియు కుప్పలు కుప్పలుగా పడియున్నకట్టెలు ఏ ప్రకారము ఒక్క నిప్పురవ్వచే భస్మీభూతమగునో, అట్లే పరమభక్తుని పూర్వకాలిక పాపమంతయు క్షణములో నశించిపోవ అతడు పుణ్యాత్ముడగును. వాల్మీకియే ఇందులకు దృష్టాంతము. ఒక గుహయందు ఎంతకాలమునుండియో చీకటి నివాసముచేయుచున్నను ఒక అగ్గిపుల్ల వెలిగించినచో అదియంతయు తృటిలో మాయపోవునట్లు అజ్ఞానవశమున పూర్వముతానాచరించిన పాపజాలమంతయు ఇప్పటి భగవద్భక్తిచే నశించిపోవ పాపి సాధువగుచున్నాడు, సుదురాచారి పరమసదాచారి యగుచున్నాడు. రాక్షసుడు దేవుడగుచున్నాడు. ఇట్టి మహత్తర పరిణామమును తెచ్చినదియేది? భగవద్భక్తియే. సమ్యక్ - జ్ఞానమే. ఈ భావమునే పూర్వము -

అపి చేదసి పాపేభ్యః సర్వేభ్యః పాపకృత్తమః, సర్వం జ్ఞానప్లవేనైవ వృజినం సన్తరిష్యసి. (4-36)

అను శ్లోకమునందు గీతాచార్యులు వ్యక్తపఱచియున్నారు. దీనినిబట్టి మనుజు డెల్ల కాలమునందును ఒకే నిమ్నస్థితియందుండునని చెప్పుట తగదనియు, అట్లుండవలెనని వాంఛించుట అంతకంటె తగదనియు. సత్ప్రయత్నముచే సర్వులును ఉన్నతపథమును జేబట్టగలరనియు, అట్లు చేబట్టవలెననియే బోధింపవలెననియు స్పష్టమగుచున్నది. పాపిని 'నీ వెల్లకాలములందును పాపివే' అనుట ఘోరపాతకమని దీనివల్ల తేలుచున్నది.

మఱియు పాపికూడ భగవద్భక్తిచే పుణ్యాత్ముడు కాగలడని చెప్పుటచే దాని అర్థము పాపముచేయవలెనని, తదుపరి భక్తిచే కడిగివేయవలెననికాదు. అదివఱలో, తెలియకచేసిన పాపము, ఇప్పటి సన్మార్గావలంబనముచేతను, అనన్యభక్తివలనను, నిర్మలజ్ఞానముచేతను భస్మీభూతమైపోగా మనుజుడు శుద్ధాత్ముడగునని చెప్పుటయే యగును. ఇట్టి అభయవాక్యమువలన సామాన్యజనానీకమున కెంతయో ఆశ్వాసము, ధైర్యము చేకూరగలదు. అందఱికిని ఉన్నతినిబొందుటకు అవకాశము లేర్పడగలవు.

దైవమార్గమును, 'సమ్యక్ - మార్గమని' (ఉత్తమమార్గమని) చెప్పుటవలనను, దానిననుసరించువానిని 'సాధువని' చెప్పుటవలనను ప్రాపంచిక మార్గములకంటె అదియెంతయో అధిక శ్రేయోదాయక మని, మిక్కిలి అనుసరణీయమని బోధింపబడినట్లగుచున్నది. కావున అసమ్యక్ - మార్గములను (దృశ్యమే సత్యమని నమ్మి అనుసరించుమార్గములను) త్యజించి, సమ్యక్ - మార్గమునే (భగవన్మార్గమునే చేబట్టవలెను.

ఇచట **'సాధువు'** అనగా జటాజూట, కాషాయాంబరములను ధరించినవాడని కాదు అర్థము. 'సాధు' పదమునకు ఉత్తమమని అర్థము. అనగా సన్మార్గుడని భావము.

ప్ర:— గొప్పదుర్మార్గుడు సన్మార్గు డెట్లు కాగలడు ?

ఉ:— పరమాత్మను అనన్యభక్తితో సేవించినచో.

ప్ర:— ప్రపంచములో ఉత్తమనిశ్చయ మేది ?

ఉ:— భగవంతుని సత్యమనినమ్మి వారి నా శ్రయించుటయే.

అ|| దైవభక్తుడెన్నటికిని చెడడని (హీనగతిని బొందడని) చెప్పుచున్నాడు -

31. క్షిప్రం భవతి ధర్మాత్మా శశ్వచ్ఛాన్తిం నిగచ్ఛతి
కౌన్తేయ ప్రతిజానీహి న మే భక్తః ప్రణశ్యతి.

టీక:– (సః = అతడు), క్షిప్రమ్ = శీఘ్రముగా, ధర్మాత్మా = ధర్మబుద్ధిగలవాడు, భవతి = అగుచున్నాడు, శశ్వత్ = శాశ్వతమైన, శాన్తిమ్ = శాంతిని, నిగచ్ఛతి = పొందుచున్నాడు, కౌన్తేయ = ఓ అర్జునా, మే = నాయొక్క, భక్తః = భక్తుడు, నప్రణశ్యతి (ఇతి) = చెడిపోడు (నశింపడు, హీనగతినొందడు) (అని), ప్రతిజానీహి = ప్రతిజ్ఞచేయుము.

తా:– అతడు (నన్నాశ్రయించిన పాపాత్ముడు) శీఘ్రముగ ధర్మబుద్ధిగలవాడగుచున్నాడు. మఱియు శాశ్వతమైన శాంతిని పొందుచున్నాడు. ఓ అర్జునా! 'నాభక్తుడు చెడడు' అని ప్రతిజ్ఞచేయుము.

వ్యాఖ్య:– పైనదెల్పిన ప్రకారముగ పాపాత్ముడైనను భగవంతుని పరమశరణ్యముగ నమ్మి భజించుచో శీఘ్రముగ ధర్మాత్ముడు, పుణ్యాత్ముడు అగుచున్నాడు. మఱియు శాశ్వతశాంతిని బడయుచున్నాడు. 'క్షిప్రమ్' – శీఘ్రముగ అని తెలుపుటవలన అట్టి శాంతిని ఏనాడో పొందుటకాదనియు దైవమునాశ్రయించిన వెనువెంటనే లభించుననియు స్పష్టమగుచున్నది. దీపము వెలిగించిన మఱుక్షణమే చీకటి పోవునుగదా! దైవమార్గమున జనులు కొందఱు 'మాకు మోక్షమెపుడు లభించునో' అని సంశయగ్రస్తులై యుందురు. అట్టిసంశయముల కిచట భగవానుడు తావులేకుండ చేసివైచిరి. 'అనన్యభక్తితో మీరు నన్ను భజించుచో శీఘ్రముగ మీకు మోక్షరూప పరమశాంతి లభించును' అని పరమాత్మ భక్తుల కిచట అభయమొసంగిరి.

భగవత్సేవనమువలన మనుజునకు రెండు గొప్పఫలితములు చేకూరునని యిట వచింప బడినది – (1) అతడు ధర్మాత్ముడగును (2) శాశ్వతమగు శాంతిని లెస్సగ బడయును. అతడు ధర్మమయుడై, సదాచారవంతుడైయుండును. ఏ కోశమునను అతనికి అధర్మము వర్తింపకుండును. మఱియు నతడు గొప్పశాంతిని బొందును.

'తేషాం శాన్తిశ్శాశ్వతీ నేతరేషామ్' అని యుపనిషత్తులున్ను ఈసత్యమునే ఉద్ఘోషించుచున్నవి. దృశ్యవస్తువును వెన్నంటుకొలది శాంతి దూరముగ పలాయనమగుచుండును. దైవమును వెన్నంటినచో అది అతిసమీపమునకు వచ్చుచుండును.

ఇక ఈ శ్లోకముయొక్క రెండవపాదమున 'న మేభక్తఃప్రణశ్యతి' (నాభక్తు డెన్నడునుచెడడు, దుర్గతినొందడు) అను గంభీరసత్యమును భగవానుడు వెల్లడించిరి. ఈ అష్టాక్షరీ మహామంత్రమును ముముక్షువులు నిరంతరము స్మృతిపథమున నుంచుకొనవలెను. అధైర్యము, నిరుత్సాహము కలిగినపుడెల్ల దీనిని స్మరించుచుండవలెను. పరమార్థరంగమున ప్రవేశించుటకుముందు కొందఱికి కొన్ని సంశయములు కలుగుచుండును – భక్తి గలిగియున్నచో ప్రయోజన ముండునో, లేదో, దానివలన సద్గతి కలుగునో లేదో, అని. అట్టివారి సందేహములన్నిటిని గీతాచార్యు లీశ్లోకమున పటాపంచలు చేసివైచిరి. 'దైవము నాశ్రయించిన వాడెన్నడును చెడడు, అతడు సద్గతినే చెందును' అని అసందిగ్ధముగ చెప్పివేసిరి. కల్పవృక్షము నాశ్రయించినవానికి దుస్థితి యెట్లు కలుగగలదు? గంగానదిని ఆశ్రయించినవారికి దాహ మెట్లు కలుగును?

'ప్రతిజానీహి' (ప్రతిజ్ఞచేయుము) అని అర్జునుని యాజ్ఞాపించుటలో తన భక్తుడు చెడడను ఆ వాక్య మెంతటి సత్యమో తేటతెల్లమగుచున్నది. ఇది ముమ్మాటికి సత్యమని భగవానుడు పలుకుటవలన ఆ

వాక్యముయొక్క యాథార్థ్యము చక్కగ ఋజువగుచున్నది. భక్తులయొక్క సద్గతినిగూర్చి భగవానుడు జనుల కెట్టి విశ్వాసమును గలుగ జేయుచున్నారో చూడుడు! కాబట్టి ఇక జనులందఱును ప్రతిజ్ఞాపూర్వకములైన ఈ భగవద్వాక్యములపై పూర్ణవిశ్వాసముంచి తమ హృదయమందలి సంశయములను పారద్రోలి సర్వేశ్వరుని ఇతోధికముగ సేవించి కృతార్థులగుదురుగాక!

ప్ర:— దైవము నాశ్రయించినపాపి యెట్టివాడుగా మారును?

ఉ:— ధర్మాత్ముడుగా మారును.

ప్ర:— ఎంతకాలమునకు?

ఉ:— శీఘ్రముగ.

ప్ర:— అట్టి భగవదారాధనమువలన లభించు ఫలితమేమి?

ఉ:— శాశ్వతమగు శాంతి.

ప్ర:— కావున శాశ్వతశాంతి లభించుటకు ఉపాయమేమి?

ఉ:— అనన్యభక్తితో భగవత్సంసేవనము గావించుట.

ప్ర:— భగవద్భక్తునకు దుర్గతి ఎన్నడైన కలుగునా?

ఉ:— ఎన్నటికిని కలుగదు, ఈ సత్యమును భేరీమ్రోగించి ప్రతిజ్ఞచేసి చెప్పవచ్చును.

అ॥ భగవదాశ్రయముచే ఉచ్చనీచభేదములేక సర్వులును తరించిపోవుదురని వచించుచున్నాడు-

32. మాం హి పార్థ వ్యపాశ్రిత్య యేఽపి స్యుః పాపయోనయః
స్త్రియో వైశ్యాస్తథా శూద్రాస్తేఽపి యాన్తి పరాంగతిమ్.

టీక:— పార్థ = ఓ అర్జునా!, యే = ఎవరు, పాపయోనయః అపి = పాపజన్మము (నీచజన్మము) గలవారును, స్యుః = అగుదురో, తే అపి = వారున్ను, స్త్రియః = స్త్రీలున్ను, వైశ్యాః = వైశ్యులున్ను, తథా = అటులనే, శూద్రాః = శూద్రులున్ను, మామ్ = నన్ను, వ్యపాశ్రిత్య = ఆశ్రయించి, పరామ్‌గతిమ్ = సర్వోత్తమపదవిని (మోక్షమును), యాన్తి హి = నిశ్చయముగా పొందుచున్నారు.

తా:— ఓ అర్జునా ! ఎవరు పాపజన్మము (నీచజన్మము) గలవారైయుందురో, వారును, స్త్రీలును, వైశ్యులును, అట్లే శూద్రులును నన్నాశ్రయించి సర్వోత్తమపదవిని (మోక్షమును) నిశ్చయముగ పొందుచున్నారు.

వ్యాఖ్య:— పాపజన్మము (నీచజన్మము) కలవారైనప్పటికి, లేక స్త్రీ వైశ్యశూద్రాదులైనప్పటికిని భగవంతుని ఆశ్రయించి ధ్యానాదులు సలుపుచో వారుకూడ పరమగతియగు మోక్షమును పొందగలరని యిచట వచింపబడినది. అట్టివారే భక్తిచే మోక్షము బడయుచుండ ఇక తక్కినవారి విషయమై వేఱుగ చెప్పవలెనా అని భావము. ఇచట 'పాపయోనయః' అనుపదము 'స్త్రీవైశ్యశూద్రాదు' లకు అన్వయించి అర్థము

చెప్పుటయుక్తముకాదు. ఆ పదమును వేఱుచేసి పాపజన్ములైనవారున్ను మఱియు స్త్రీవైశ్యశూద్రులున్ను భగవదాశ్రయముచే తరించిపోవుదురని చెప్పుటయే సముచితముగ నుండును. శ్రీధరుడు, శంకరానందగిరి మున్నగువారట్లే అర్థముచెప్పిరి. ఏలయనిన, స్త్రీలను పాపజన్ములనుటచే వారికిపుట్టు సంతానమున్ను పాపజన్ములనియే చెప్పవలసివచ్చును. అత్తఱి ప్రపంచమందలి జనులందఱును, అన్ని వర్ణములవారును, పుణ్యాత్ములు సహితము పాపులు కావలసివచ్చును. అది అసంగతము. కావున ఈ అర్థము సమీచీనముగ గన్పట్టుటలేదు. పురుషులకువలె స్త్రీలకుకూడ బ్రహ్మవిద్యాధికారముకలదనియు, వారుకూడ పరమార్థసాధనలను అవలంబించి తరించవచ్చుననియు ఈశ్లోకముద్వారా స్పష్టముగ నిరూపింపబడినది. ఔషధమును సేవించుటకు రోగులందఱున్ను అర్హులే; వారు పురుషులుకాని, స్త్రీలుకాని, ఏ జాతివారుకాని, ఏ మతమువారుకాని అవుగాక! అట్లే భవరోగభేషజమగు ఈ బ్రహ్మవిద్యనుగూర్చియు గ్రహించనగును. కనుకనే భగవాను డీ శ్లోకమున వైశ్యశూద్రులను పేర్కొని జాతిభేదమును, స్త్రీలను పేర్కొని లింగభేదమును, పాపాత్ములను పేర్కొని గుణభేదమును అధ్యాత్మపథమున తొలగించివైచిరి. ఎట్టివాడైనను సరియే భగవదాశ్రయముచే తరించిపోవచ్చునని రూఢిపఱచిరి. ఇట్టి విశాలభావములను ప్రకటించుటయందే గీతయొక్క విశేషత కలదు. సంకుచితభావముల కతీతమై గీత నడచుచుండును. యోగ్యతకు ప్రాధాన్యమొసంగుచుండును.

ఎవరు అద్దమును తుడుచుదురో వారిముఖము దానియందు బాగుగ కన్పించును. దానిని ఎవ్వరైనను తుడువవచ్చును. గొప్పకులమందు జన్మించినను అద్దమును తుడువనిచో వారికి ముఖము సరిగా కనుపించదు. అల్పకులస్థుడైనను దానిని తుడిచినచో ముఖము చక్కగ గోచరించును. భగవదాశ్రయముచే తరించినవారియందు నీచజాతులవారిలో గుహుడుమున్నగువారిని, స్త్రీలలో శబరి, గోపికలు మున్నగువారిని, వైశ్యులలో సమాధి★ మున్నదువారిని, శూద్రులలో సంజయుడు మున్నగువారిని పేర్కొనవచ్చును.

పరాంగతిమ్ - సర్వోత్తమపదవి అని దైవపదమును వర్ణించుటవలన, ప్రపంచములోని సమస్తపదవులకంటెను, గతులకంటెను, పరమాత్మపదవి అత్యంతశ్రేష్ఠమైనదని నిశ్చితమగుచున్నది. కావున క్షుద్రములగు క్షణిక ప్రాపంచికపదవులకై సమయమును ధారబోయక భక్త్యాదుల నవలంబించి శాశ్వతదైవపదప్రాప్తికై సర్వులును యత్నింపవలసియున్నది.

ప్ర:- దైవపద మెట్టిది ?

ఉ:- ప్రపంచములోని సమస్తపదవులకంటెను, స్థానములకంటెను సర్వోత్తమమైనది.

ప్ర:- దానినెవరు పొందగలరు ?

ఉ:- భగవానుని ఆశ్రయించి నిర్మలభక్తితో ధ్యానములను సల్పువారందఱున్ను పొందగలరు.

ప్ర:- ఈ మోక్షమార్గమున జాతి మత కుల లింగ విచక్షణకలదా ?

ఉ:- లేదు. పాపజన్ములు (నీచకులస్థులు), మఱియు స్త్రీలు, వైశ్యులు, శూద్రులు అందఱును భగవత్సమాశ్రయముచే ముక్తినొందగలరు.

★ సమాధియను వైశ్యభక్తునిగూర్చి మార్కండేయ పురాణము (18-93) నందు, బ్రహ్మవైవర్త పురాణము (62-63) నందు గలదు.

అ॥ ఈ ప్రపంచ మనిత్యమని, దుఃఖభూయిష్ఠమని తెల్పుచు తద్విముక్తికై తన్ను భజింపుమని భగవానుడు బోధించుచున్నాడు -

33. కిం పునర్బ్రాహ్మణాః పుణ్యా భక్తా రాజర్షయస్తథా
అనిత్యమసుఖం లోకమిమం ప్రాప్య భజస్వ మామ్.

టీక:– పుణ్యాః = పుణ్యాత్ములైన, బ్రాహ్మణాః = బ్రాహ్మణులున్ను, తథా = అటులనే, భక్తాః = భక్తులైన, రాజర్షయః = రాజర్షులున్ను, పునఃకిమ్ (వక్తవ్యమ్) = (భగవదాశ్రయముద్వారా ఉత్తమగతినొందుదురని) మఱల జెప్ప నేల ?, అనిత్యమ్ = నిత్యముకానిదియు (క్షణభంగురమైనదియు), అసుఖమ్ = సుఖములేనిదియునగు, ఇమమ్ = ఈ, లోకమ్ = లోకమును (లేక, శరీరమును), ప్రాప్య = పొంది, మామ్ = నన్ను, భజస్వ = భజింపుము (సేవింపుము).

తా:– ఇక పుణ్యాత్ములగు బ్రాహ్మణుల విషయముననను, భక్తులగు రాజర్షుల విషయమునకు మఱల జెప్పనేల? (భగవదాశ్రయముచే వారున్ను తప్పక ముక్తినొందుదురని భావము). కావున అశాశ్వతమై, సుఖరహితమైనట్టి ఈలోకమును పొందియున్న నీవు నన్ను భజింపుము.

వ్యాఖ్య:– పాపాత్ములే పరమాత్మను సేవించినచో ముక్తిని బొందుచుండ ఇక పుణ్యాత్ములవిషయమై, భక్తులవిషయమై వేఱుగచెప్పవలెనా? అని వచించుచున్నారు. మఱియు స్త్రీలు, వైశ్యులు, శూద్రులుకూడ భగవంతుని ఆశ్రయించి పరమగతిని బొందుచుండ ఇక బ్రాహ్మణులవిషయమై, క్షత్రియులవిషయమై మఱల చెప్పవలెనా? అనియు నిటపేర్కొనబడినది. అయితే ఎవ్వరైనప్పటికిని పుణ్యమును, భక్తిని సంపాదించిన మాత్రమే అట్టి సద్గతిని బడయగలరని 'పుణ్యాః' 'భక్తాః' అను రెండుపదములద్వారా వ్యక్తమగుచున్నది. అవి లేనివారు ఉత్తమకులజులైనను, ముక్తిని బొందజాలరని భావము. కాబట్టి మోక్షకాంక్షులందఱును (1) పుణ్యము (2) భక్తి అను రెండు పదార్థములను తప్పక సేకరించవలసియున్నది.

'రాజర్షయః' - ఋషిత్వమును (ఇంద్రియనిగ్రహాదులను) బొందిన రాజులని అర్థము. రాజ్యపాలనమువలన అనేక కార్యకలాపములందు, లోకవ్యవహారములందు మునింగియుండు రాజులే ఋషిత్వమును, భక్త్యాది సద్గుణములను పూర్వము సంపాదించియుండ, ఇక సామాన్య కుటుంబవ్యవహారములుగల వ్యక్తి ఋషిత్వము నేల సంపాదింపలేడు ? ప్రయత్నముచే తప్పక సాధించవచ్చును.

'అనిత్యమసుఖం లోకమ్' - ఈ ప్రపంచమును (లేక ఈ జన్మను లేక ఈ శరీరమును) భగవానుడు అనిత్యముగను, సుఖరహితముగను వర్ణించిరి. ఈవాక్యమును సర్వులును బాగుగ జ్ఞప్తియందుంచుకొనవలెను. జీవితము క్షణికము. శరీరములు ఎప్పటికప్పుడు రాలిపోవుటకు సిద్ధముగానున్నవి. ఘటము ఏనాడైనను మృత్తికయందు కలిసిపోవును. అట్లే ఈ ప్రపంచముగాని, దేహములుగాని, వానికారణమగు పంచభూతములలో కాలక్రమమున విలయమైపోవును. కనుకనే ఈ జగత్తు అనిత్యమని వర్ణించబడినది. దేహాదులు అనిత్యములుగావున వానితో చేయవలసిన పరమార్థకార్యములను అతిశీఘ్రముగ చేసివేయవలెను. నావ బాగుగనున్నపుడే దానితో సముద్రమును దాటివేయవలెను. ప్రపంచము, దేహము శాశ్వతమని తలంచి విఱ్ఱవీగుచుండువారికి కనువిప్పు గలిగించుటకే కాబోలు భగవానుడు 'ఇదియంతయు అనిత్యమైనద'ని

హెచ్చరించిరి. (చావుగాని, వినాశముగాని జ్ఞప్తికి వచ్చినపుడే సామాన్యముగ మనుజుడు కడతేరు మార్గమునుగూర్చి యోచించుచుండును). ఇంతియే కాదు. ఈ ప్రపంచము 'అసుఖమ్' (సుఖరహితమైనది) అనియు వ్రాక్రుచ్చిరి.

'నాల్పే సుఖమస్తి భూమా వై తత్సుఖమ్' అను ఉపనిషద్వాక్యము బోధించినరీతిగ అల్పమగు దృశ్యవస్తువునందు వాస్తవముగ సుఖము లేదు. అనంతమగు ఆత్మయందే కలదు. క్షణికపదార్థమందు, నశ్వరవస్తువునందు సుఖమెట్లుండగలదు? సామాన్యముగ భోగవిలాసమగ్నులగు జనులీప్రపంచమును వర్ణించినపుడు 'ఇది చాల ఆనందకరమైనది' అని చెప్పుదురు. కాని భగవానుడట్లు చెప్పలేదు. తద్విరుద్ధమగు భావమునే సూచించిరి. దీనిని సుఖవర్జితముగ వర్ణించెను. ఆత్మవస్తువొకటియే సుఖస్వరూపము. అనాత్మరూపమగు దృశ్యమంతయు సుఖరహితమైనది.

ఈ ప్రకారముగ ప్రపంచము 'అనిత్యమ'ని, అసుఖమని వర్ణింపబడినది సరియే, అయితే దానినుండి తప్పించుకొనుటెట్లు? అను ప్రశ్న సహజముగనే ఇప్పట్టున ఉదయించును. దానికి సమాధానమును భగవానుడే ఇచట నొసంగిరి. - 'భజస్వమామ్' (నన్ను భజింపుము) అని. భవరోగమునకు, దుఃఖవిముక్తికి ఇదియే పరమౌషధము - భగవత్సంసేవనము, పరమాత్మను సేవించుటయే, ధ్యానించుటయే. 'అనిత్యము' యొక్క బారినుండి తప్పించుకొనుటకు నిత్యమునే ఆశ్రయించవలసియుండును. అట్లే 'అసుఖము'ను (దుఃఖమును) వదలించుకొనుటకు 'సుఖ' వస్తువునే ఆశ్రయించవలెను. అట్టి నిత్యసుఖవస్తువే ఆత్మ, పరబ్రహ్మము, దైవము. కావున అతనినే భజించి కృతార్థుడు కావలయును (భజస్వమామ్). ఆపాతరమణీయమగు ఈ దృశ్యప్రపంచముయొక్క తళుకు బెళుకులకు మోసపోక సత్యశివసుందరమగు పరమాత్మనే ఆశ్రయించి తరించవలెను. ఈ ప్రకారముగ రోగమును, ఔషధమును - రెండిటిని ఈ శ్లోకమున శ్రీకృష్ణమూర్తి ప్రవచించినవారైరి.

ప్ర:- భగవత్ప్రాప్తికి అవసరమైన వస్తువులెవ్వి?

ఉ:- (1) పుణ్యము (2) భక్తి.

ప్ర:- ఈ ప్రపంచమెట్టిది?

ఉ:- (1) అనిత్యమైనది (2) సుఖవర్జితమైనది.

ప్ర:- ఈ జననమరణరూప సంసారబంధనమునుండి తప్పించుకొనుటకు ఉపాయమేమి?

ఉ:- భగవానుని భజించుటయే.

అ॥ భగవత్ప్రాప్తికి మార్గములను సెలవిచ్చుచున్నాడు -

34. మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు
మామేవైష్యసి యుక్త్వైవమాత్మానం మత్పరాయణః.

టీక:- మన్మనాః = నాయందే మనస్సుగలవాడవును, మద్భక్తః = నాభక్తుడవును, మద్యాజీ = నన్నేపూజించువాడవును, భవ = అగుము, మామ్ = నన్నే, నమస్కురు = నమస్కరింపుము, ఏవమ్ = ఈ

రీతిగా, ఆత్మానమ్ = మనస్సును, యుక్త్వా = నాయందేనిలిపి, మత్పరాయణః = నన్నేపరమగతిగ నెన్నుకొనినవాడవై, మామ్ ఏవ = నన్నే, ఏష్యసి = పొందగలవు.

తా:– నాయందే మనస్సుగలవాడవును, నాభక్తుడవును, నన్నే పూజించువాడవును అగుము. నాకు నమస్కరింపుము. ఈ ప్రకారముగ చిత్తము నాయందే నిలిపి నన్నే పరమగతిగ నెన్నుకొనినవాడవై తుదకు నన్నే పొందగలవు.

వ్యాఖ్య:– సాధనచేయనిచో సాధ్యవస్తువు లభించదు. ఈ శ్లోకమందు బ్రహ్మాభ్యాసము చక్కగ వివరింపబడినది. బ్రహ్మమును, దైవమును బొందుటకు మార్గము చెప్పబడినది. 'తచ్చిన్తనం తత్కథనమన్యోన్యం తత్ప్రభాషణమ్' అనునట్లు, లక్ష్యమగు దైవమునుగూర్చియే చింతించుట, వారినిగూర్చియే చెప్పుట, వారినిగూర్చియే పరస్పరము సంభాషించుకొనుట, వారిని గూర్చియే ధ్యానించుట మున్నగు క్రియలద్వారా మనుజుడు ఆ పరమాత్మను అచిరకాలములో చేరుకొనగలడు. ఇట్టి అభ్యాసమే ఈ శ్లోకమున తెలియజేయబడినది. నిరంతరము భగవత్పరాయణుడై శరీరము, వాక్కు, మనస్సు అను త్రికరణములను వారియందే సంలగ్నపఱచి తదేకనిష్ఠుడైయుండువాడు లక్ష్యమును సులభముగ బొందగలడు. సామాన్యముగ జనులయొక్క మనస్సు దృశ్యవస్తువులయందే ఎక్కువగ రమించుచుండును. దానిని అచ్చోటనుండి మరలించి పరమాత్మయందు స్థాపించవలెను. అట్లు స్థాపించుటకుగాను భక్తి ఎంతయో అవశ్యకమై యున్నది. ఒక వస్తువునందు ప్రీతి, విశ్వాసము, భక్తి జనించినపుడే ఆ వస్తువుపై మనస్సు నిలుచును. కాబట్టి భగవంతునియొక్క శాశ్వతత్వ, సుఖరూపత్వములను బాగుగనెఱింగి, వారిపై భక్తివిశ్వాసములను అభివృద్ధిపఱచవలెను. అపుడు సహజముగనే మనస్సు పరమాత్మవైపునకు మరలుచుండును. వారినే ఆరాధించుచు, వారికే నమస్కరించును.

'యద్భావం తద్భవతి' అనునట్లు మనస్సు ఎద్దానినిగూర్చి నిరంతరము చింతనచేయుచుండునో తద్రూపముగా మారిపోవును. కావున మనస్సు అనవరతము పరమాత్మనుగూర్చియే విచారణధ్యానాదులను సలుపుచుండినచో, ఆ పరమాత్మయందే లయమై తద్రూపముగ మారిపోవును. అదియే జీవబ్రహ్మైక్యము. 'మామేవైష్యసి' అనుదానియర్థ మిదియే. ఇట్టి స్థితి పైనదెల్పిన అభ్యాసమువలననే సిద్ధించును.

దీనినిబట్టి భగవత్ప్రాప్తికి నిరంతర భగవచ్చింతన, భగవత్పరాయణత్వము తప్ప అన్యమగు మార్గమేదియు లేదని స్పష్టపడుచున్నది. కావున దుఃఖభూయిష్టమై, అనిత్యమైనట్టి ఈ సంసారస్థితినుండి తప్పించుకొని, నిరతిశయానందరూపకైవల్యమును బడయుటకై జీవుడు తనమనస్సును దృశ్యవిషయములనుండి మరల్చి, దైవోన్ముఖముగ, ఆత్మోన్ముఖముగ నొనర్పవలయును. అట్లుకాక, సోమరియై దృశ్యవాసనలతోనే, విషయభోగములతోనే గూడియున్నచో ఆత్మప్రాప్తినిగూర్చిన వార్తకూడ అతనికి లభింపనేరదు. కాబట్టి ఎవరైనను 'నేను భగవంతుని ఎట్లు పొందగలను?' అని ప్రశ్నించినచో వారి నిట్లు అడుగవలయును – '(1) నీమనస్సు దేనిపై లగ్నమగుచున్నది? దృశ్యవస్తువులందా, పరమాత్మయందా? (2) నీవు దేని యెడల భక్తి గలిగియున్నావు? దృశ్యముపైనా, దేవునిపైనా? (3) దేని నారాధించుచున్నావు? నశ్వరవిషయములనా, శాశ్వతదైవమునా? (4) దేనికి నమస్కరించుచున్నావు? నామరూపములకా, పరమాత్మకా? (5) దేనియందు పరాయణుడవై యున్నావు? శబ్దాది విషయములందా, హృదయస్థాత్మయందా?' – అట్లు ప్రశ్నించి అతడేమి సమాధాన మొసంగునో చూడవలెను. దృశ్యమందే మనస్సు ఆసక్తమగుచున్నదని తెలిపినచో అటనుండి మరల్చి శ్రీకృష్ణభగవాను డీ శ్లోకమున తెలిపినరీతి దైవపరాయణముగ గావింపవలెననియు, అదియే దైవప్రాప్తికి, మోక్షమునకు మార్గమనియు చెప్పవలెను.

ప్ర:– జీవుడు భగవంతుని ఎట్లు పొందగలడు? భగవత్ప్రాప్తికి ఏ యే సాధనలను అవలంబించవలెను?

ఉ:– (1) మనస్సును పరమాత్మయందే లగ్నము చేయవలెను. (2) పరమాత్మయందే భక్తి గలిగి యుండవలెను. (3) పరమాత్మనే ఆరాధించవలెను. (4) పరమాత్మనే నమస్కరింపవలెను. ఈ ప్రకారముగ నిరంతరము దైవపరాయణుడై వర్తించవలెను.

ఓమ్

ఇతి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే
శ్రీకృష్ణార్జునసంవాదే రాజవిద్యా రాజగుహ్యయోగో నామ
నవమోఽధ్యాయః
ఇది ఉపనిషత్ప్రతిపాదకమును, బ్రహ్మవిద్యయు, యోగశాస్త్రమును, శ్రీకృష్ణార్జున సంవాదమునగు
శ్రీ భగవద్గీతలందు రాజవిద్యా రాజగుహ్యయోగమను
తొమ్మిదవ అధ్యాయము
ఓమ్ తత్ సత్

